నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
## కరీంనగర్
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల
బుధవారం 11 మార్చి 2026 15 పేజీలు


ఈ నిర్లక్ష్యానికి
బాధ్యులు ఎవరు..???
- పొగతో కమ్ముకున్న కరీంనగర్
- డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు?
- చెత్త కుప్పలకు మంటలు... నగరమంతా దట్టమైన పొగ


# సూర్య కథనానికి స్పందన

## డంపు యార్డును సందర్శించిన మున్సిపల్ కమిషనర్

- డంపు యార్డు సమస్యను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు ప్రత్యేక చర్యలు
- మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

సూర్య కరీంనగర్ ప్రతినిధి



సూర్య ఎఫెక్ట్

2లో



# పల్లెల్లో ప్రాణాలు హరిస్తున్న పారాక్వాట్ గడ్డిమందు

- కలుపు మందు పేరుతో ప్రాణాంతక ప్రమాదం
- పారాక్వాట్... రైతు పొలంలో అవసరం, ప్రాణాలకు ముప్పు
- క్షణికావేశాల్లో తాగి ప్రాణాలు కోల్పోతున్న రైతులు

సూర్య కొడిమ్యాల

వ్యవసాయంలో గడ్డి నియంత్రణ కోసం ఉపయోగించే పారాక్వాట్ గడ్డి మందు ఇప్పుడు పల్లెల్లో ప్రాణాలను తీస్తున్న ప్రమాదకర విషంగా మారుతోంది. అప్పుల బాధలు, కుటుంబ సమస్యలు లేదా ఇతర కారణాలతో కొందరు రైతులు క్షణికావేశంలో ఈ మందు తాగి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్నాయి. దీంతో పారాక్వాట్ వంటి అత్యంత విషపూరిత గడ్డి మందుపై ప్రభుత్వం తక్షణమే కఠిన నియంత్రణలు విధించాలని, అవసరమైతే పూర్తిగా నిషేధం అమలు చేయాలని రైతు సంఘాలు, గ్రామ పెద్దలు డిమాండ్ చేస్తున్నారు. 2లో




### కాంగ్రెస్ పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తా

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

సూర్య జగిత్యాల ప్రతినిధి (వివరాలు లోపలి పేజీల్లో)

### పంచాయతీ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలి

- మండల స్థాయిలో ప్రభుత్వ భవన నిర్మాణ లక్ష్యాన్ని నిర్దేశించాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా
- ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సమీక్ష

సూర్య కరీంనగర్ ప్రతినిధి (వివరాలు లోపలి పేజీల్లో)

### రూ. 2 కోట్ల రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం...

- నడిరోడ్డు పైనే కరెంట్ పోల్...!
- వల్భాపూర్ - కనపర్తి రహదారి పై పొంచి ఉన్న ప్రమాదం

సూర్య వీణవంక (వివరాలు లోపలి పేజీల్లో)

99 రోజుల కార్యాచరణపై
# స్థానిక ప్రజా ప్రతినిధులకు అవగాహన

- సీఎస్ కె.రామ కృష్ణ రావు
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎస్

సూర్య కరీంనగర్ ప్రతినిధి 2లో






ప్రజల భాగస్వామ్యంతోనే
# ప్రభుత్వ పథకాలు విజయవంతం

- హుజురాబాద్‌ను మోడల్ మున్సిపాలిటీగా మారుస్తా...
- ఎన్నికల వరకే రాజకీయం... తర్వాత అభివృద్ధే ధ్యేయం
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

సూర్య, హుజురాబాద్: ప్రజల ఆకాంక్ష మేరకు పరిపాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని, ప్రజల భాగస్వామ్యం ఉంటేనే అవి విజయవంతం అవుతాయని రాష్ట్ర బిసి, సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంగళవారం హుజురాబాద్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ సుహాసిని, వైస్ చైర్ పర్సన్ అంజలిల పదవి బాధ్యతల స్వీకార కార్యక్రమానికి (మిగతా 2లో)





# సూర్య కథనానికి స్పందన

(మొదటి పేజి తరువాయి)

సందర్శించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ డంపు యార్డు సమస్యను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మంగళ వారం రోజు డంపు యార్డును సందర్శించారు. రెండు ఏజెన్సీల ఆద్వర్యంలో కొనసాగుతున్న బయోమైనింగ్ ప్రక్రియ పనితీరును ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేసి పరిశీలించారు. బయోమైనింగ్ ప్రక్రియలో యంత్రాల పని తీరును పరిశీలించారు. నూతనంగా ఏజెన్సీ ద్వారా ఏర్పాటు చేసిన బయోమైనింగ్ పనితీరు పై సంతృప్తిని వ్యక్తం చేశారు. బయోమైనింగ్ ను మరింత వేగవంతం చేయాలని ఏజెన్సీ ప్రతినిధు లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్బంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... నగరపాలక సంస్థ డంపు యార్డు సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేలా నగంˇపాలక సంస్థ చర్యలు తీసుకోవడం జరుగుతుంది తెలి పారు. డంపు యార్డులో మొత్త 4 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకు పోయిందని.. యంత్రాల సహాయంతో పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయడం జరుగుతుందని తెలిపారు. ఇటీవలే కొద్ది రోజుల ఏర్పాటు చేసిన అధునాతన యంత్రం ఏర్పాటు చేసిన నుండి దాదాపు 15000 మెట్రిక్ టన్నుల చెత్తను 3 రకాల పద్దతుల్లో బయోమైనింగ్ చేయడం దరిగిందని తెలిపారు. చెత్తను బయో సాయిల్ ( కంపోస్టు), ఇన్ వర్ట్ మెటీరియల్( ఘన వ్యర్థాలు) ఆర్డీఎఫ్ మెటిరియల్ ప్లాస్టిక్ వ్యర్థాలుగా వేరు చేయడం జరుగుతుందని తెలిపారు. నూతన యంత్రం ఒక గంటకు ఒక్కో రోజులో దాదాపు 40 నుండి 50 టన్నుల చెత్తను ప్రక్షాలన చేయడం జరుగు తుంది. గతంలో స్మార్ట్ సిటీలో ఏర్పాటు చేసిన యంత్రం పని తీరు కొంత ఆలస్యమౌతుందని... సంబంధిత ఏజెన్సీ వారిని ఆదేశించడం జరిగిందని తెలిపారు. స్మార్ట్ సిటీలో ఏర్పాటు చేసిన ఏజెన్సీ ప్రతి నిధులకు నోటీసులు జారీ చేయాలని అధికారును ఆదేశించామని తెలిపారు. అంతే కాకుండా డంపు యార్డులో త్వరలోనే మరో బయోమైనింగ్ ఏర్పాటు కు తగిన చర్యలు తీస్కోవడం జరుగుతుందని...ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. డంపు యార్డుకు వచ్చిన చెత్తను ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేసేలా మరో యంత్రంను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. డంపింగ్ యార్డులో పోగను తగ్గించే విధంగా చర్యలు తీస్కుంటున్నామని... ఆగ్నిమాపక సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి... వాటిని అదుపు చేసేలా చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రాజ్ కుమార్ ఈఈ సంజీవ్ కుమార్, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ భీంవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# పల్లెల్లో ప్రాణాలు హరిస్తున్న పారా క్వాట్ గడ్డి మందు

**సూర్య కొడిమ్యాల**

గ్రామాల్లో సులభంగా లభిస్తున్న ఈ గడ్డి మందు అనుకోని విషాదాలకు కారణమవుతోంది. ఒక్కసారి శరీరంలోకి వెళ్లిన తరువాత పారాక్వాట్ ప్రభావం తీవ్రంగా ఉండటంతో బాధితులను కాపాడటం వైద్యులకు కూడా కష్టసాధ్యమవుతోంది.

**- పెరుగుతున్న విషాదాలు**

గ్రామీణ ప్రాంతాల్లో గడ్డి మందులు తాగి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.పారాక్వాట్ తాగిన బాధితులు సాధారణంగా 10 నుంచి 15 రోజులు ఆసుపత్రుల్లో చికిత్స పొందాల్సి వస్తోంది.చికిత్స ఖర్చులు లక్షల రూపాయలకు చేరుతున్నాయని కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.చాలాసార్లు చికిత్స ఫలించక బాధితులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు నమోదవుతున్నాయి.ఆసుపత్రుల్లో రోజులు తరబడి చికిత్సపారాక్వాట్ తాగిన బాధితులను వెంటనే ఆసుపత్రులకు తరలించినప్పటికీ పరిస్థితి విషమంగా మారుతుందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపే ఈ రసాయనం కారణంగా బాధితులు ఐసీయూలో రోజులు తరబడి చికిత్స పొందాల్సి వస్తోంది. దీంతో పల్లె కుటుంబాలు భారీ వైద్య ఖర్చులతో ఆర్థికంగా కుదేలవుతున్నాయి. రైతుల ఆవేదనరైతులు మాట్లాడుతూ పంటల్లో గడ్డి నియంత్రణ కోసం ఈ మందు అవసరమయ్యే పరిస్థితి ఉన్నప్పటికీ, ఇది సులభంగా అందుబాటులో ఉండటం వల్ల ప్రాణాపాయానికి దారితీస్తోందని చెబుతున్నారు. “పారాక్వాట్ వంటి ప్రమాదకర మందులు గ్రామాల్లో సులభంగా లభిస్తున్నాయి. క్షణికావేశంలో కొందరు తాగి ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రభుత్వం వెంటనే నియంత్రణలు తీసుకురావాలి.”

**- డాక్టర్ల హెచ్చరిక**

వైద్యులు చెబుతున్న వివరాల ప్రకారం పారాక్వాట్ అత్యంత విషపూరిత రసాయనం. ఇది శరీరంలోకి వెళ్లిన తరువాత అంతర్గత అవయవాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. “పారాక్వాట్ తాగిన వ్యక్తిని కాపాడటం చాలా కష్టం. కొద్దిపాటి పరిమాణం కూడా ప్రాణాపాయం కలిగించే అవకాశం ఉంది.

**- ప్రభుత్వ నిబంధనలు - అధికారుల సూచనలు**

వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు గడ్డి మందులను ఉపయోగించే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.ప్రమాదకర గడ్డి మందులను భద్రంగా నిల్వ చేయాలిపిల్లలకు అందుబాటులో లేకుండా చూడాలిఅవసరమైన పరిమితిలో మాత్రమే వినియోగించాలివ్యవసాయ పనుల్లో గ్లౌజులు, మాస్కులు వంటి రక్షణ పరికరాలు ఉపయోగించాలిఖాళీ సీసాలను నిర్లక్ష్యంగా పడేయకుండా సురక్షితంగా తొలగించాలి.

**- పారాక్వాట్ ఎందుకు ప్రమాదకరం?**

ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రమాదకర గడ్డి మందుల్లో ఒకటి కొద్దిపాటి పరిమాణం కూడా ప్రాణాలకు ముప్పు ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చికిత్స చాలా క్లిష్టం. “క్షణికావేశం వల్ల ఒక కుటుంబం మొత్తం జీవితాంతం బాధపడే పరిస్థితి వస్తోంది”పల్లెల్లో ప్రాణాలకు ముప్పుగా మారుతున్న పారాక్వాట్ గడ్డి మందు వినియోగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు సూచించారు. రైతులు ఈ మందును వాడేటప్పుడు తప్పనిసరిగా భద్రతా నియమాలు పాటించాలని ఆయన పేర్కొన్నారు. “పారాక్వాట్ వంటి ప్రమాదకర రసాయనాల వినియోగంపై రైతులకు సరైన అవగాహన కల్పించడం చాలా అవసరం. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అలాగే ఈ మందు విక్రయంపై కూడా నియంత్రణలు ఉండాలి. రైతుల ప్రాణ భద్రత దృష్ట్యా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి” అని ఆయన తెలిపారు.

# ఈవీఎం గోదాం వద్ద అప్రమత్తంగా ఉండాలి

**- ఈవీఎం గోదాశీను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

జిల్లా కేంద్రశీ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాశీను మంగళవారం జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా రాజకీయ పార్టీ ప్రతినిధిలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్ధేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాశీ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ ఫుటేజ్ ల గదుల పనితీరు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ లక్ష్మి కిరణ్ ఆర్డీవో కె. మహేశ్వర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేనీ




శ్రీనివాస్, బిజెపి పార్టీ ప్రతినిధి దేవిశెట్టి నవీన్ కుమార్, టిడిపి పార్టీ ప్రతినిధి ఎర్రవెల్లి రవీందర్ బీఎస్పీ పార్టీ ప్రతినిధి సిరిసిల్ల అంజయ్య ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల కార్యాచరణ పై స్థానిక ప్రజా ప్రతినిధులకు అవగాహన

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

99 రోజుల కార్యాచరణపై స్థానిక ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించాలని సిఎస్ కే రామకృష్ణారావు తెలిపారు.మంగళవారం సీఎస్ కె.రామ కృష్ణ రావు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి ఈ కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఎస్ కె.రామ కృష్ణ రావు మాట్లాడుతూ మార్చ్ 6 నుంచి జూన్ 12 వరకు చేపట్టనున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణ, ఫైల్ క్లియరెన్స్ జిల్లా లలో బాగా జరుగుతుందని అన్నారు. మార్చి 12న జిల్లా స్థాయిలో సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సీఎస్ సూచించారు. నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజా ప్రతినిధులు పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వం నిర్వహిస్తున్న మొదటి కార్యక్రమం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో వారి భాగస్వామ్యం కీలకం కానుందని సీఎస్ తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో 99 రోజుల కార్యాచరణ ఉద్దేశం అందరికీ అర్థమయ్యే విధంగా తెలియజేయాలన్నారు.ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల పై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించాలని అన్నారు. 99 రోజుల కార్యాచరణ 10 థీమ్స్ తో జరుగుతుందని, వీటికి సంబంధించిన శాఖ అధికారులు వచ్చి జిల్లాలో ఎటువంటి కార్యక్రమాలు జరుగుతున్నాయో, అందులో ప్రజా ప్రతినిధులు పోషించాల్సిన పాత్ర గురించి స్పష్టంగా సమాచారం అందించాలన్నారు.99 రోజుల కార్యాచరణ లో సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్ , వార్డు సభ్యులు, పోషించాల్సిన పాత్ర గురించి స్పష్టంగా వివరిస్తూ తెలుగులో ట్రైనింగ్ మేటిరియల్ జిల్లాలకు పంపామని అన్నారు.అమృత్ 2.0 క్రింద గత సంవత్సరం మంచి పురోగతి సాధించినట్లు, ఈ పనులు త్వరగా పూర్తి చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ ప్రణాళిక ప్రతి మున్సిపాలిటీ తయారు చేసుకోవాలని, సీఎం ఆదేశాల మేరకు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ కార్పొరేటర్లకు గుర్తింపు కార్డులు అందించాలన్నారు.ప్రజా ప్రతినిధులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి సంబంధించి అవసరమైన అన్ని లాజిస్టిక్ ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టాలని అన్నారు. ప్రతి శాఖ నుంచి మంచి స్పీకర్లు వచ్చి ప్రభుత్వ కార్యక్రమాల గురించి స్పష్టంగా వివరించాలని సీఎస్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో కరీంనగర్ కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తో పాటు అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డిఓ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పథకాలు విజయవంతం

(మొదటి పేజి తరువాయి)

మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, హుజురాబాద్ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొదట హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వ అనుకూల ఫలితాలు వచ్చాయని అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని తర్వాత ప్రజాప్రతినిధుల ఆలోచన అంతా అభివృద్ధి పైనే ఉండాలన్నారు. హుజురాబాద్ సమగ్ర అభివృద్ధి కోసం చైర్ పర్సన్ ప్రతిపాదించిన ప్రతిపాదనలకు సిఎం ద్వారా హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్, ఇతరుల సహకారంతో నిధులు మంజూరు చేయించి హుజురాబాద్ మున్సిపాలిటీ ని మోడల్ మున్సిపా లిటీగా మార్చడానికి కృషి చేస్తానన్నారు. తాను ఎంపిగా పని చేసినప్పుడు తనకు హుజురాబాద్, జమ్మికుంట ప్రాంతాలతో అనుబంధం ఉందని, ఇక్కడి ప్రజలతో అవినాభావ సంబంధం ఉందని అన్నారు. తాను శక్తివంచన లేకుండా అభివృద్ధి కోసం ప్రభుత్వ నుండి నిధులు మంజూరయ్యేల కృషి చేస్తానన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... హుజురాబాద్ తో సంబంధం ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ప్రాంతా అభివృద్ధి కోసం పెద్దన్న పాత్ర పోషించాలన్నారు. హుజురాబాద్ లో పార్టీలకు అతీతంగా హుజురాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉండాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా నెరవేరుస్తున్నామని, రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ విజయం సొంతం చేసుకుంటుందని, నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ పాలకవర్గానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, ఏసిపి వాసంశెట్టి మాధవి, తహశీల్దార్ జక్కుల నరేందర్, మున్సిపల్ కమిషనర్ అహ్మద్ సయ్యద్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, మహిళా సంఘ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

రాజన్నసిరిసిల్ల

బుధవారం 11 మార్చి 2026



# నిరుపయోగ వస్తువులు, పరికరాలు తొలగించాలి

**- ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలి - రికార్డులు, ఫైళ్లు నిబంధనల ప్రకారం భద్రపరచాలి**

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**సూర్య రాజన్న సిరిసిల్ల**

ప్రతి ప్రభుత్వ కార్యాలయం నిరుపయోగ వస్తువులు, పరికరాలు తొలగించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం స్వచ్ఛత,పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై తనిఖీ చేశారు.గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ లోని నీటి పారుదల శాఖ, ఈఈ పీ ఆర్,



ఆర్ అండ్ బీ, బీసీ సంక్షేమ శాఖ, డీటీ సీపీఓ, కార్మిక శాఖ, భూగర్భ శాఖ, డీఆర్ డీఓ, మైనింగ్, సీపీఓ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, సహకార శాఖ, ఎక్సైజ్, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పౌర సరఫరాల శాఖ, ఉపాధి కల్పన శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా పంచాయతీ ఆఫీస్, ట్రెజరీ శాఖ, ఏవో ఆఫీస్, డీపీఆర్ఓ, సంక్షేమ శాఖ తదితర కార్యాలయాలను కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లోని వివిధ గదుల్లో ఉన్న ఫర్నిచర్, ఫైల్స్, రికార్డులు, సామగ్రి పరిశీలించారు.

# ఏళ్ల నాటి మురికినీటి కష్టాలకు 'మోక్షం'

**- 25వ వార్డులో డ్రైనేజీ పనులు ప్రారంభం**

**సూర్య, వేములవాడ**

వేములవాడ పట్టణంలోని 25వ వార్డు పరిధిలో సాయిబాబా దేవాలయానికి వెళ్లే ప్రధాన మార్గంలో గత కొన్నేళ్లుగా నెలకొన్న మురికి నీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఈ ప్రాంతంలో నూతన డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను మంగళవారం స్థానిక కౌన్సిలర్ బాల కృష్ణ రాజు సమక్షంలో ప్రారంభించారు.గత పాలకవర్గం హయాం నుంచే ఈ సమస్య వేధిస్తోంది. ఇక్కడ ఉన్న ఓపెన్ ప్లాట్ల యజమానులు తమ స్థలాల గుండా మురికి కాలువ నిర్మాణానికి అంగీకరించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో ఇళ్ల నుంచి వచ్చే మురికి నీరు రోడ్డుపైనే నిలిచిపోయి, కుంటలను



తలపించేది. ఈ కారణంగా తీవ్ర దుర్వాసన వ్యాపించడమే కాకుండా, దోమలు పెరిగిపోయి ప్రజలు అనారోగ్యం పాలయ్యే పరిస్థితి నెలకొంది.నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ బాలకృష్ణ రాజు ఈ సమస్యను సవాలుగా తీసుకున్నారు. ప్రజల ఇబ్బందులను గమనించి, ప్లాట్ యజమానులతో స్వయంగా పలుమార్లు చర్చలు జరిపారు. ప్రజారోగ్యం దృష్ట్యా కాలువ నిర్మాణం ఎంత అవసరమో వారికి వివరించి, సానుకూల నిర్ణయం తీసుకునేలా సమన్వయం చేశారు. పనులు ప్రారంభం కావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. "ఏళ్ల తరబడి మురికిలోనే బతికాము, ఇప్పుడు మా కష్టాలు తీరబోతున్నాయని స్థానికులు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వార్డులో ఏ సమస్య ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రథమ ప్రాధాన్యమని ఈ సందర్భంగా బాలకృష్ణ రాజు స్పష్టం చేశారు.

## ఈ కంప్యూటర్ ఆపరేటర్లు సామూహిక సెలవు

**- ఎంపీడీవో ఎంపీఓవోకు వినతి పత్రం**

**సూర్య, బోయినిపల్లి**




మండలము లోని 5 నెలలు గా వేతనాలు రాని ఈ పంచాయతి కంప్యూటర్ ఆపరేటర్లు బొంగాని గౌతమ్, రాగుల నరేందర్, మల్లగళ్ల ఆనంద్ గారలు మంగళవారం బోయినపల్లి ఎంపీడీవో ఎంపీఓలకు జిల్లా యూనియన్ నిర్ణయం మేరకు సాముహిక ముగా సెలవుపై వినతి పత్రము అందజేత. ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్‌లము ముగ్గురము (3) మండల ప్రజా పరిషత్ కార్యాలయము బోయినిపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలో విధులు నిర్వహిస్తున్నాము. మాకు అక్టోబర్ 2025 మాసము నుండి దాదాపుగా ఐదు నెలలుగా వేతనములు రావడం లేదు. మాకు గతములో వచ్చే రూ.22750/– జీతమునకు బదు లుగా జనవరి 2025 నుండి 19,500/– ఇవ్వడం వలన మేము ఒక్క నెలకు 3250/–(3250X12=45,500) రూపాయలు నష్టపోయాము. దాని వలన మా కుటుంబాన్ని పోషించుకోవడం ఇబ్బందికరంగా మారింది. మా జీవితం గడవడం పెనుభారంగా మారింది. వీటితో పాటుగా రోజు కార్యాలయమునకు రావడానికి పోవడానికి మా ప్రయాణాల ఖర్చులకు కూడా చాలా ఇబ్బందిగా ఉంది. గత జనవరి 2025 నుండి ఏనాడు వేత నాలు సకాలంలో రాలేదు. అయినను మాయొక్క విధులతో పాటుగా మన కార్యాలయములో అన్నీ పనులు మా కర్తవ్యాలను సక్రమంగా నిర్వహిం చాము. ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్లా జిల్లా నిర్ణయం మేరకు మాకు ఏ రోజున అయితే వేతనములు వస్తాయో ఆ రోజు నుండి మళ్ళీ తిరిగి విధులకు హాజరవుతామని తమరికి సవినయముగా తెలుపుచున్నాము.

## గాయత్రి బ్యాంక్ 'నిర్భయ' భరోసా

**- ఖాతాదారుడి కుటుంబానికి లక్ష బీమా చెక్కు అందజేత**

**సూర్య, వేములవాడ**

ప్రమాదవశాత్తు మరణించిన గాయత్రి బ్యాంక్ ఖాతాదారుడు కుక్కల సుమన్ కుటుంబానికి 'గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతా' ద్వారా లభించే లక్ష రూపాయల ప్రమాద బీమా మొత్తాన్ని అందజేశారు.మృతుడు సుమన్ భార్య (నామినీ) కుక్కల స్వప్నకు 1,00,000 (అక్షరాలా ఒక లక్ష రూపాయల) బీమా చెక్కును వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు గాయత్రి బ్యాంక్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.బ్యాంకు ఏజీఎమ్ చిట్లబోట్ల వంశీకృష్ణ మాట్లాడుతూ తమ బ్యాంక్ కేవలం ఆర్థిక లావాదేవీలకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతతో ఖాతాదారుల కుటుంబాలకు భద్రత కల్పిస్తోందని తెలిపారు. వేములవాడ ప్రజల నగదు అవసరాల కోసం ఏటీఎంలను నిరంతరం అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. నామమాత్రపు చార్జీలతో లక్ష రూపాయల ప్రమాద బీమా కల్పించడం ద్వారా ఖాతాదా



రులకు ధీమా ఇస్తున్నామని పేర్కొన్నారు. బ్రాంచ్ మేనేజర్ గజేంద్ర బ్రాంచ్ మేనేజర్ గోలి గజేంద్ర మాట్లాడుతూ బ్యాంకు అందిస్తున్న వివిధ రుణ పథకాలను వివరించారు.బంగారు ఆభరణాలపై గ్రాముకు అత్యధికంగా 8,600 వరకు రుణం అందిస్తున్నట్లు వెల్లడించారు. కిసాన్ వికాస్ పత్రాలు, పోస్ట్ ఆఫీస్ డిపాజిట్లపై కేవలం 10 శాతం పీఏ (0.83 పైసలు) వడ్డీకే రుణ సౌకర్యం కలదనీ పేర్కొన్నారు. కొత్త ఖాతాలు తెరవడానికి అవసరమైన ఫోటోలు, జిరాక్స్ ప్రతిలను బ్యాంక్ ప్రాంగణంలోనే ఉచితంగా సమకూరుస్తున్నామని తెలిపారు.మైక్రో ఏటీఎం, ఏఈపీఎస్ సేవల ద్వారా కస్టమర్ల ముంగిటకే బ్యాంకింగ్ సేవలను తీసుకువచ్చామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో ప్రక్షాళన పర్వం

**- ఎనిమిది మందిపై సస్పెన్షన్ వేటు!**

**సూర్య, వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2026 మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలను విరుద్ధంగా వ్యవహరించి రెబెల్‌గా పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్పడిన నాయకులపై సస్పెన్షన్ వేటు పడింది.వేములవాడ మున్సిపల్ పరిధిలో నాగుల రాము గౌడ్,హైమద్ పాషా (అడ్డు), కుమ్మరి శేఖర్,ఇర్ఫాన్ సస్పెండ్ చేసింది.ఈ సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తాయని జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పేర్కొన్నారు.

## గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి

**- ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన జిపి కార్మికులు**

**సూర్య, గంభీరావుపేట**



గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం గంభీరావుపేట ఎంపీడీవో రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. పెండింగులో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఒక్క పూట పని కల్పిస్తూ జీవో జారీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల వేతనాలను పంచాయతీ ద్వారానే చెల్లించాలని నిర్ణయిస్తు తీసుకున్న మెమోను తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతినెల గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు అంజాగౌడ్,నాయకులు బిక్షపతి, రవి, సకులవ్వ, ఎల్లవ్వ, బూదయ్య, సాయిలు, రాములు, లక్ష్మి, బాబాయ్ తదితరులు ఉన్నారు.

## అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన సర్పంచ్

**సూర్య, బోయినపల్లి**



మండలంలోని నీలోజిపల్లి అంగన్వాడి కేంద్రాన్ని చైర్మన్ సర్పంచ్ అనుముల భాస్కర్ తనిఖీ చేయడం జరిగింది. పిల్లలకు అందిస్తున్న పోషక ఆహారాలపై అడిగి తెలుసుకున్నారు.స్కూలుకు వస్తున్నారా తెలుసుకోవడం జరిగింది.అంగన్వాడికి నీటి సమస్య ఉన్నందున రెండు రోజులలో పరిష్కరిస్తానని తెలిపారు. పిల్లల విషయంలో జాగ్రత్త వహించాలని అంగన్వాడి టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుసుమ మహేం దర్, పంచాయతీ కార్యదర్శి స్వప్న,వార్డు సభ్యులు తిమ్మా రెడ్డి శైలజ అనిల్ కుడుకల శ్రీకాంత్ అనుముల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



## గీత కార్మికుని కుటుంబానికి రూ 2 లక్షల చెక్కు అందజేత

**సూర్య, తంగళ్ళపల్లి**



తంగళ్ళపల్లి మండలం జిల్లెల్లలో ఇటీవల మృతి చెందిన సాయిలి కిషన్ గౌడ్ కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు రూ 2 లక్షల చెక్కును మంగళవారం అందజేశారు. సోమవారం రోజున కేటీఆర్, మృతుడు సాయిల్ కిషన్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. మాట ఇచ్చిన ప్రకారమే మృతుని కుటుంబానికి రూ 2 లక్షల ఫిక్స్ డిపాజిట్ చెక్కును బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు కోడూరి భాస్కర్ గౌడ్, దుబ్బాక రమేష్ పాల్గొన్నారు.


నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
జగిత్యాల
బుధవారం 11 మార్చి 2026 4

# పట్టణ ప్రజలకు శుభ్రమైన ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలి

## - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**సూర్య, రాయికల్**

పట్టణ ప్రజలకు శుభ్రమైన,ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు.రాయికల్ మండల కేంద్రంలో పారిశుధ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి.ఇటిక్యాల గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్,అంగన్‌వాడి, పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్.పరిశీలించారు.రాయికల్ పట్టణంలో పారిశుధ్య పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీలు,మార్కెట్ ప్రాంతాలు,ప్రజా ప్రదేశాల్లో నిర్వహిస్తున్న శుభ్రత కార్యక్రమాలను పరిశీలించి,ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతరం శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. పట్టణ ప్రజలకు శుభ్ర



మైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం కోసం పారిశుధ్య పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం మండలంలోని ఇటిక్యాల గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ నిర్మాణ దశలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్,అంగన్‌వాడి కేంద్రం, జెడ్పిహెచ్ఎస్ పాఠశాల భవనాల పనులను పరిశీలించారు.చేపడుతున్న నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు త్వరితగతిన ఆరోగ్య, విద్యా సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, పోషకాహార సేవలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ సమయపాలనతో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె. రాము,జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీఓ చిరంజీవి, మున్సిపల్ చైర్మన్ రవీందర్, స్థానిక సర్పంచ్ నీరటి శ్రీనివాస్, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జగిత్యాల విద్యుత్ ఉద్యోగుల నిరసన

**సూర్య, జగిత్యాల అర్బన్**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఎలక్ట్రిసిటీ అమెండ్మెంట్ బిల్ 2025కు వ్యతిరేకంగా జాతీయ విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు జగిత్యాల జిల్లా విద్యుత్ కార్యాలయం ఆవరణలో విద్యుత్ ఉద్యోగులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ నిరసన లో భాగంగా జేఏసి నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే నిలిపి వేయాలని, ప్రైవేటీకరణ తొ ఇప్పుడు ఉన్న ఉద్యోగులకు తీవ్రమయిన నష్టం తీరని అన్యాయం జరగడమే కాకుండ నిరుద్యోగులకి ప్రభుత్వ కొలువులు రావని చెప్పారు. అలాగే రైతులకి, సామాన్య ప్రజలకి, చిన్న- మధ్య తరగతి పరిశ్రమలకు, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అన్ని సబ్సిడీలను క్రమ




క్రమంగా ఎత్తి వేయాల్సి వస్తుందని, విద్యుత్ చార్జీలు ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో పెరుగుతాయని, అలాగే ప్రజల సొమ్ముతో కార్మికుల చెమటని చిందించి దశాబ్దాలుగా నిర్మించుకున్న వందలకోట్ల విలువైన లైన్స్‌ని ప్రైవేట్ కంపెనీలకు నామ మాత్రపు చార్జీలకే ధారాదత్తం చేయవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎప్పుడైనా స్టేట్ సభ్యులని తీసివేసే అధికారం పొందనుందని, దీనివలన రాష్ట్రాల హక్కులకు భంగం ఏర్పడుతుంది చెప్పారు.ఈ బిల్లు ద్వార ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ సంస్థలనుంచి విద్యుత్‌ని అధిక ఛార్జీలకు కొనే దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు.విద్యుత్ సవరణ బిల్‌ని రద్దు చేసెంతవరకు వరకు మా నిరసనలు ఆగవని ఇంకా ఉధృతం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో ఎస్ఈ సుదర్శనం, డీఈలు గంగారాం, మదసూదన్, గోపి కృష్ణ, ఎస్ఏఓ శ్రీనివాస్, జేఏసి నాయకులు చేరాలు, ఆర్మూల్ల ప్రసాద్, రాంజీ నాయక్, వరుణ్ కుమార్, జవహర్ నాయక్, సతీష్, ప్రవీణ్, ఆంజనేయులు, రహీమ్, అశోక్ రెడ్డి, భూమయ్య, అభీద్, అజీజు,పలు సంఘాల నాయకులు, విద్యుత్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# 99 డేస్ యాక్షన్ ప్లాన్ పచ్చి మోసం

## - ప్రజలను మోసం చేస్తూ... కాలయాపన కోసమే ఈ ప్రణాళిక

## - మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత సురేష్

**సూర్య, జగిత్యాల ప్రతినిధి**

99 డేస్ యాక్షన్ ప్లాన్ పచ్చి మోసం అని, ప్రజలను మోసం చేస్తూ, కాలయాపన కోసమే ఈ ప్రణాళిక అని మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఆరోపించారు. మంగళవారం జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగతి ప్రణాళిక పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపనా చేసే ప్రయత్నం చేస్తు మరోసారి ప్రజలను మోసం చేసే కుట్ర చేస్తుంది అన్నారు. కాంగ్రెస్ ముసుగులో టిడిపి పాలనా రాష్ట్రంలో సాగుతుంది అని విమర్శించారు. గద్దెనెక్కి రెండున్నర ఏళ్లు గడిచింది. ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలు



ఏమయ్యింది.100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేశారా ప్రజలు ఆలోచించాలి అన్నారు. గతంలో కేసిఆర్ పల్లె, పట్టణ ప్రగతి పేరుతో మౌలిక వసతుల కల్పనా ధ్యేయంగా ముందుకు సాగారు.ప్రతి నెల ప్రణాళిక అమలుకు కోట్ల రూపాయలు నిధులు కేటాయించారు అని గుర్తు చేశారు. అందాల పోటీలకు పైసలు ఉంటాయి ఆడబిడ్డ లకు, రైతులకు ఇచ్చేందుకు పైసలు ఉండడం లేదా?జగిత్యాలలో విచిత్రపరిస్థితి నెలకొంది. ఎవరు ఏ పార్టీలో ఉన్నారో అర్థం అయితలేదు అన్నారు. సంజయ్ బిఆర్ఎస్‌లో ఉన్న అంటాడు, పక్కన అన్ని కాంగ్రెస్ కండువాలు ఉంటాయి. పార్టీ మారినోళ్లను రాళ్లతో కొట్టమని సువ్ చేర్చుకున్నావు? దేనితో ఎవరిని కొట్టాలి? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు ఐల్నేని వెంకటేశ్వర్ రావు, కౌన్సిలర్లు దేవేందర్ నాయక్, హరీష్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, అర్బన్ మండల అధ్యక్షుడు తుమ్మ గంగాధర్, సీనియర్ నాయకులు శీలం ప్రవీణ్, కమలాకర్ రావు, ప్రవీణ్ గౌడ్, హరీష్, ప్రతాప్, సన్నిత్ రావు, కళ్యాణి, మానస, నవీన్, శివ పాల్గొన్నారు.

### పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**సూర్య, వెల్గటూర్**

పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని వెంకటాపూర్ సర్పంచ్ బిళ్లకూరి తిరుపతి అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బిళ్లకూరి తిరుపతి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు.పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు.ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వైద్యా సిబ్బంది పాడి రైతులకు పశువుల గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లం శ్రీనివాస్, పశు వైద్య సిబ్బంది సంధ్య,నాగరాజు,నారాయణ, రాంకుమార్, చంద్రయ్య, అంజి పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**సూర్య, పెగడపల్లి**



మండల కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సై కిరణ్ కుమార్ విద్యార్థిని, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని, సైబర్ నేరాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, రోడ్డు భద్రత నియమాల అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### జగ్గాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా వైద్య శిబిరం

**సూర్య, రూరల్ మెట్‌పల్లి**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజుల్లోభాగంగా జగ్గా సాగర్ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా అధికారి డాక్టర్ రాజేందర్ రెడ్డి,మండల వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డి మరియు డా. తాటిపర్తి శివాని రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక స్పెషలిస్ట్ వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పరిశీలించారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో పుల్ల జగన్ గౌడ్, మహేందర్ రెడ్డి, సురేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

**సూర్య, మేడిపల్లి / భీమారం**



మండలంలోని వెంకటరావుపేట్, భీమారం గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిట్స్ స్వచ్ఛంద సంస్థ అధినేత అంగడి ఆనంద్ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మండల విద్యాధికారి మధుసూదన్ రెడ్డితో కలిసి మంగళవారం రోజు పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడులు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగడి ఆనంద్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు విద్యార్థులందరూ ఇష్టపడి చదివి ఉన్నతమైన ర్యాంకులు సాధించాలని, మండలానికి గొప్ప పేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు కాసుగంటి శ్రీనివాస్, బొమ్మెన ప్రశాంత్, చెక్కపల్లి స్వాతి సంజీవ్, ప్రధానోపాధ్యాయులు రవీందర్, అశోక్, నాయకులు కొత్తపల్లి అజయ్, ఎండి సయ్యద్, అమీర్, చెక్కపల్లి శంకర్, చెక్కపల్లి రఘు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రైతు నేస్తం ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు

**సూర్య, కొడిమ్యాల**



కొడిమ్యాల మండలంలోని కొడిమ్యాల, పూడూర్, తిర్మలాపూర్ రైతు వేదికల్లో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్ కొడిమ్యాల రైతు వేదికలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయిల్ పామ్ పంటలో వరిని అంతర పంటగా సాగు చేసే విధానం గురించి రైతుల కు వివరించారు. అలాగే యూరియా యాప్ వినియోగం, పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణ చర్యలపై కూడా రైతులకు అవగాహన కల్పించారు.అనంతరం శాస్త్రవేత్తలతో రైతులు పరస్పర చర్చ కార్యక్రమం నిర్వహించారు. రైతులు తమ సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లగా, వారు తగిన సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి, వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రీష్మ, రాజేష్, తేజస్విని, శ్రీలత, వ్యవసాయ విద్యార్థులు,రైతులు పాల్గొన్నారు.



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

పెద్దపల్లి

బుధవారం 11 మార్చి 2026



## రామగుండంను విద్య, వైద్య, వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దుతాం

**-ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ -ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా 19, 38 డివిజన్ లలో పర్యటన**

**సూర్య-గోదావరిఖని:**

రామగుండం నగరాన్ని విద్య, వైద్య, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కోరారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం 19వ డివిజన్ అల్లూరు, సంతోష్ నగర్, 38వ డివిజన్ సీతా నగర్ ప్రాంతాల్లో నగర మేయర్ మహంకాళి స్వామి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె.అరుణశ్రీతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ గతంలో బొందల గడ్డగా మారిన రామగుండం నగరాన్ని పునర్నిర్మించి అద్భుత నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. విమర్శలను పట్టించుకోకుండా అభి వృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పా రు. త్వరలో రామగుండం నగరానికి మరో రెండు భారీ పరిశ్రమలు రానున్న నేపథ్యంలో నగరం ఐదు లక్షల జనాభాతో మహానగర స్థాయికి ఎదుగుతుందని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో లక్షలాది ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని, రామగుండం నగరంలో కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు అనేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఏటీసీ, పీజీ కళాశాల, నర్సింగ్ కళాశాలలతో పాటు స్కిల్



డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పి స్తున్నామని చెప్పారు.స్వశక్తి మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించేందుకు కోట్ల రూపా యల సబ్సిడీ రుణాలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. రామగుండంలో స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహి ంచాలని అధికారులను ఆదేశించారు. అల్లూరు, సంతోష్ నగర్ ప్రాంతాల్లో డ్రెయిన్‌లపై నిర్మించిన అనధికార కట్టడాలను తొలగించి నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్‌టీఆర్ నగర్, కళ్యాణ్ నగర్, సీతా నగర్ ప్రాంతాల నుంచి ప్రవహిస్తున్న పెద్ద కాలువను శుభ్రపరచడంతో పాటు పక్కన రోడ్డు నిర్మించే యోచన కూడా ఉందన్నారు. స్వంత స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు, స్థలం లేని పేదలకు స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. సింగరేణి స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి పట్టాలు కూడా ఇప్పిస్తామని అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నగర మేయర్ మహంకాళి స్వామి హాజరైన వారితో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయ డం వల్ల దోమలు పెరిగి వ్యాధులు వ్యాపిస్తాయని హెచ్చరించారు. నగర పాలక సంస్థ స్వచ్ఛ వాహనాలకు మాత్రమే చెత్త అందించాలని ప్రజ లను కోరారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నాయకత్వ ంలో నగరంలో రూ.800 కోట్ల విలువైన అభి వృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలి పారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ విభాగం ఆధ్వర్యంలో విలీన గ్రామం వెంకట్రావ్‌పల్లి కుమారస్వామి నగర్‌లో నిర్మించిన ఉపరితల నీటి ట్యాంక్‌ను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, మేయర్ మహంకాళి స్వామితో కలిసి ప్రారంభించారు. అనంతరం అల్లూరు, సంతోష్ నగర్ ప్రాంతాల్లో కాలువలను పరిశీలించి, సీతా నగర్‌లో చెత్త విభజన, సేకరణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్ల య్య, కార్పొరేటర్లు మారెల్లి సుశీల రాజిరెడ్డి, నెలకొంటి రాము, బుర్ర శశికళ, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, ఎస్ఈ గురువీర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి. రామన్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతమైన లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు

**- ప్రజలు ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి**

**- సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు విజయ వంతంగా నిర్వహిస్తున్నట్లు ఆసు పత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ తెలిపారు. మంగళవారం బొంపల్లి గ్రామానికి చెందిన 30 ఏళ్ల మహిళ, మంచిర్యాలకు చెందిన 40 ఏళ్ల వ్యక్తికి గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఉండటంతో లాప్రోస్కోపిక్ కోలిసిస్టెక్టమీ ఆపరేషన్ విజయవంతంగా చేశా రు. అలాగే పెద్దపల్లికి చెందిన 33 ఏళ్ల మహిళలో గర్భాశయ సంబంధిత సమస్య (ఎండోమెట్రియోసిస్) గుర్తించి దెబ్బతిన్న భాగాన్ని తొలగించారు.ఈ శస్త్రచికిత్సలను లాప్రోస్కోప్ సర్జన్ డా. అమర సింహా రెడ్డి, జనరల్ సర్జన్ డా. సాయి ప్రసాద్, డా. స్వాతి, డా. రామమన్, డా. భవాని కలిసి నిర్వ హించారు. ఈ వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినం దించారు.ప్రజలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న నవజాత శిశు కేంద్రం, 2డీ ఎకో, లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ, రూట్ కెనాల్ సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఆసుపత్రిలో అందించే అన్ని సేవలు ఉచితమని, ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే నర్సింగ్ సూపరిం టెండెంట్, ఆర్‌ఎంఓ లేదా సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని తెలిపారు.

## రాములపల్లి లో పోచమ్మ గుడి వద్ద బోరు ఏర్పాటు

**- ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల కృతజ్ఞతలు**

**సూర్య - ఎలిగేడు**



ఎలిగేడు మండలంలోని రాముల పల్లి గ్రామంలో మంగళవారం పోచమ్మ గుడి వద్ద తాగునీటి సౌక ర్యం లేక గ్రామ ప్రజలు ఇబ్బం దులు పడుతున్న నేపథ్యంలో పెద్దపల్లి శాసనసభ్యులు చింత కుంట విజయ రమణారావు వెంట నే స్పందించారు. గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించి తన నిధులైన ఎస్‌డీఎఫ్ నుంచి బోరు వేయించి చేతి పంపును ఏర్పాటు చేయించారు.బోరు ఏర్పాటు కావడంతో పోచమ్మ గుడి వద్ద తాగునీటి సమస్యకు ఉపశమనం లభించిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ ప్రజల సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణారావుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ సిద్ధి తిరుపతి యాదవ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ కుల సంఘాల పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు

**సూర్య - పెద్దపల్లి రూరల్**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో బాగంగా మండలం లోని పెద్దకల్వల, చీకురాయి గ్రామాల్లో సర్పంచ్ నర్ర కనకమ్మ పోలురాజు, ఓదెల శ్రీనివాస్ లు స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూవ్ పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. పలు వార్డు ల్లో మురికి కాలువలు శుభ్రం చేసి , రోడ్డు కు ఇరువైపుల చెత్త చెదారం తొలగింపు కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దకాలవలలో ఉప సర్పంచ్ పర్స లక్ష్మీ , కార్యదర్శి శ్రావణ్, చీకురాయి గ్రామ ఉప సర్పంచ్ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు నమోదు

**- పని వద్ద సాంకేతికతతో ముఖ గుర్తింపు**

**- ఏ పీవో రమేష్ బాబు**

**సూర్య - పెద్దపల్లి రూరల్**



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎన్ఎంఎంఎస్ ద్వారా ఇకపై హాజరు నమోదు తో పాటు పని వద్ద సాంకేతికతతో ముఖ గుర్తింపు చేస్తున్నామని ఏపివో రమేష్ బాబు అన్నారు. ఈ సందర్భంగా ఏ పీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం లో అక్రమాలను పూర్తిగా అరికట్టి నిజమైన పని చేసేవారికి మాత్రమే ప్రయోజనాలు చేకూరుస్తుందని అన్నారు. ఇప్పటి వరకు గ్రూప్ ఫోటోలతో సరిపోయేది కానీ ఇకపై ప్రతి కూలీ ముఖాన్ని యాప్‌లో స్కాన్ చేసి , ముఖ్యంగా ఉదయం హాజరు సమయంలో ఇది తప్పనిసరి అని తెలిపారు. ఇప్పటి వరకు ఆధార్ తో ఈ కేవైసి చేశామని, చేసుకోని వారు ఆధార్ కార్డు లో సరి చేసుకోవాలని సూచించారు. నాలుగు గంటల తర్వాత మళ్ళీ స్కాన్ చేసి ఫోటో అప్ లోడ్ చేయాలని, మొదటిది, రెండవ ఫోటో సక్రమంగా ఉంటే ఖాతా లో డబ్బులు జమ అవుతాయని అన్నారు.



## ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ రామగుండం

**- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

**సూర్య యైటింక్లయిన్ కాలనీ**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. 8వ కాలనీ, 19వ డివిజన్ అల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా 2కే రన్‌ను ప్రారంభించి చెత్త రహిత రామగుండం లక్ష్యంగా శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు.19వ డివిజన్ కార్పొరేటర్ మారెల్లి సుశీల రాజిరెడ్డి ఆధ్వర్యంలో డ్రైనేజ్ క్లీనింగ్, బుషెస్ కటింగ్ కోసం రెండు జేసీబీలు, బ్లూ ట్రాక్టర్లు, మున్సిపల్ సిబ్బందిని ఏర్పాటు చేసి పనులు నిర్వహించారు. నాళాలు, డ్రైనేజీలు, ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ మాట్లాడుతూ నాళాల్లో చెత్త పేరుకుపోకుండా ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మఖాన్ సింగ్ రాజ్ ఠాకూర్, మేయర్ మహంకాళి స్వామి, డిప్యూ టీ మేయర్ పాటిపల్లి ఎలయ్య, కార్పొరేటర్లు ముస్తఫా, దూళికట్ట సతీష్, అనుము రాములు, గుండేటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. డివిజన్ ప్రెసిడెంట్ మార్కరాజు, మోతుక్కూరి శంకర్, పూజారి రాకేష్, సోషల్ మీడి యా ఇంచార్జ్ మేకల అజయ్, బొల్లం రాజు, దేవయ్య, సాదుల రాజేష్, మోను, సాదుల అరుణ్, మున్సిపల్ సిబ్బంది, సూపర్వైజర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని వికలాంగుడు మృతి

**సూర్య ఓదెల**

గుంపుల గ్రామానికి చెందిన కోలాపురి శ్రీనివాస్ వయసు 38 సంవత్సరాలు అను వ్యక్తి కి పుట్టుకతోనే రెండు కాళ్లు పనిచేయవు ఈనెల 8వ తేదీ రోజున ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ లో పెళ్లి ఫంక్షన్ కి వెళ్లి రాత్రి 7 గంటల సమయంలో గుంపుల గ్రామానికి రోడ్డుపై దేకుతూ వస్తుం డగా ఫంక్షన్ హాల్ దగ్గర గుంపుల గ్రామానికి చెందిన శ్రీపతి బిక్షపతి అను వ్యక్తి అతివేగంగా అజాగ్రత్తగా తన ద్విచక్ర వాహనాన్ని నడిపి శ్రీని వాస్ ను ఢీ కొట్టడంతో వీపు భాగంలో కాళ్లకు చేతులకు రక్త గాయాలు కావడంతో శ్రీనివాసు ను వెంటనే జమ్మికుంట ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చారు. తెల్లవారి ఉదయం 10 సమయంలో హాస్పిటల్ కి వెళ్దామని లేపగా అప్పటికే చనిపోయినట్లు, మృతు నీ అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ తెలిపినారు.

# అన్నదాత వెన్ను విరుస్తున్న ప్రభుత్వాలు

**- రైతు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని దీక్ష - రైతు ప్రజా సంఘాల జాతీయ అధ్యక్షుడు రామారావు**

**సూర్య, హుజురాబాద్**



కేవలం పేరుకే రైతు పక్షపాతి అని చెప్పుకుంటున్న ప్రభుత్వాలు అన్నదాత ఆదుకోకుండా వారి వెన్ను విరుస్తున్నాయని రైతు ప్రజాసంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నారు. మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని వివిఎల్ఆర్ గార్డెన్ లో రైతు సమస్యలపై సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశానికి అన్నం పెట్టే రైతన్న విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, కేవలం పత్రికల్లో ప్రచారం కోసం తప్ప ఆచరణలో ఏమి లేవు అన్నారు. అన్నధాతలను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని అన్నారు.

**- హామీల అమలుకు ఈనెల 14 న నిరాహార దీక్ష**

రైతులకు సంక్షేమం కోసం పాటుపడతామని, ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చిందని కానీ ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత రెండున్నర సంవత్సరాలలో వాటిని తుంగలో తొక్కిందని, రైతుకి ఇచ్చిన హామీల అమలు కోసం ఈ నెల 14న హుజురాబాద్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతు ప్రజా సంఘాల నాయకుడు ముచ్చ సమ్మిరెడ్డి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారని అన్నారు. రైతుమిత్ర ప్రజాసంఘాల అధ్యక్షుడు గూడూరి స్వామి రెడ్డి, ప్రధాన కార్యదర్శి చందుపట్ల నరసింహ రెడ్డిలు మాట్లాడుతూ... అన్నదాతలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ హుజురాబాద్‌లో 14 వ తేదీన నిరవరధిక నిరాహార దీక్షకు పూనుకున్న హుజురాబాద్ ప్రాంత రైతు ప్రజాసంఘాల నాయకుడు మచ్చా సమ్మిరెడ్డి కి మద్దతుగా తాము ఒక రోజు సంఘీభావంగా దీక్షలో పాల్గొంటున్నట్లు ప్రకటించారు. రైతుల పంటల పై ప్రస్తుతం అమలు జరుగుతున్న గిట్టుబాటు ధరలు అన్న దాతలకు ఏ మాత్రం ఆమోదయోగ్యంగా లేనే లేవని రైతులు పండించిన పంటలకు రైతులే గిట్టు బాటు ధరలను నిర్ణయించుకునే అవకాశం కల్పించే విధంగా జాతీయ స్థాయిలో ప్రత్యేక చట్టం తీసుకు రావాలని, గ్రామీణ ప్రాంతాలలో ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత పెరుగుతోందని, ఖర్చులు బాగా పెరిగి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతుల వ్యవసాయ రంగానికి చేయూతను ఇచ్చేందుకు గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చెయ్యాలంటే జాతీయ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ రంగాన్ని తక్షణమే అనుసంధానం చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘ కార్యదర్శి పసుల స్వామి, ఓసి ఐకాస రాష్ట్ర నాయకులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి, పోరెడ్డి కిషన్ రెడ్డి, కొనిశెట్టి మునీందర్, కంకణాల సరోజన జనార్ధన్ రెడ్డి, కొన్నే సమ్మిరెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్ వద్ద ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

**- 57 ఆటోల స్వాధీనం**

**సూర్య కరీంనగర్**



ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆదేశాల మేరకు నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. మంగళవారం స్థానిక బస్టాండ్ ఇన్ గేట్ వద్ద ట్రాఫిక్ పోలీసులు భారీ స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ప్రధానంగా ఆటోలపై దృష్టి సారించిన పోలీసులు, సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించారు. ఈ క్రమంలో డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, టాప్ నంబర్లు ప్రదర్శించకపోవడం, వాహన ధ్రువ పత్రాలు (RC, Insurance) లేనివి. నెంబర్ ప్లేట్లు సరిగ్గా లేని 57 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల యజమానులకు, డ్రైవర్లకు మోటార్ వాహన చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, అన్ని రకాల పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో రిజర్వు ఇన్స్పెక్టర్ కుమార స్వామి, ఎస్సై ప్రమోద్ రెడ్డితో పాటు ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

## 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' పాట ఆవిష్కరణ

**సూర్య, వీణవంక**



తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న హామీల నేపథ్యంలో రూపొందించిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" పాటను హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు మంగళవారం ఆవిష్కరించారు. వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ కవి, గాయకుడు, టిపిసిసి సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షుడు గోనెల సమ్మన్న ముదిరాజ్ ఈ పాటను రచించి ఆలపించారు. హుజురాబాద్‌లోని తన కార్యాలయంలో ప్రణవ్ బాబు ఈ పాటను విడుదల చేసి సమ్మన్నను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ విధంగా నెరవేరుస్తుందో ఈ పాట ద్వారా అద్భుతంగా వివరించారని ప్రణవ్ బాబు కొనియాడారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో తాటిపల్లి జంపన్న (కోశాధికారి, సింగర్),మేకల ఎల్లారెడ్డి (మల్లారెడ్డిపల్లి మాజీ సర్పంచ్), పల్లేర్ల కిరణ్ గుప్తా (వీణవంక మండల ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు), వీణవంక మండలానికి చెందిన ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెస్ నెట్వర్క్ ఆధ్వర్యంలో చెస్ బోర్డుల పంపిణీ

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ (అర్బన్ & రూరల్), కొత్తపల్లి మూడు మండలాలలో గల ప్రభుత్వ పాఠశాలలకు చెస్ నెట్వర్క్ ఆధ్వర్యంలో బి వెంకటేశ్వర రావు. ఇంజనీర్ సహకారంతో ప్రతి పాఠశాలలో చదువుతున్న ప్రతి 20 మందికి ఒక్క చెస్ బోర్డు చొప్పున 858 చెస్ బోర్డులను స్థానిక సుభాష్ నగర్ లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వివిధ స్కూల్స్ నుండి వచ్చినటువంటి ఉపాధ్యాయులకు చెస్ బోర్డులను ఇవ్వడం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చెస్ నెట్వర్క్ ఫౌండర్ కోదాటి సుధీర్, బివి రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లు కలిగి ఉండాలని, మేదోసంపత్తి ఎదుగుదల,ఆత్మవిశ్వాసం,సరియైన నిర్ణయాలు తీసుకోవడం, మంచి భవిష్యత్తును నిర్ణయించుకునే అవకాశాలు పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరూ ముందు వరుసలో ఉండేలా, తీర్చిదిద్దేందుకు చెస్ నెట్వర్క్ ఆధ్వర్యంలో చెస్ బోర్డులు పంపిణీ చేస్తున్నామని తెలియజెప్పినారు. యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ సమాజంలో విలువలు, ఉండాలి అంటే చక్కని నైపుణ్యాలు క్రమశిక్షణ ప్రతి ఒక్క విద్యార్థినీ విద్యార్థులు అలవర్చుకోవాలని, కష్టపడి చదివి, నచ్చిన రంగంలో ఎదగడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని విద్యార్థులకు సందేశాన్ని ఇచ్చినారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల జి హెచ్ ఎస్ సుభాష్ నగర్ ప్రధానోపాధ్యాయులు రవీందర్, యాదగిరి శేఖర్ రావు,కే సురేష్ చెస్ నెట్వర్క్ ప్రోగ్రాం మేనేజర్, విద్యాసాగర్, కరీంనగర్ అర్బన్ రూరల్ కొత్తపల్లి మండలాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని ఐకేపీ సెంటర్‌కు కేటాయించాలి

**- మండల తహసీల్దార్‌కు రైతుల వినతి**

**సూర్య గంగాధర**

గంగాధర మండలంలోని చెర్లపల్లి (ఆర్) గ్రామంలో రైతుల సౌకర్యార్థం ఐకేపీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం గ్రామ సర్పంచ్ ఎట్టెపు కనుకయ్య ఆధ్వర్యంలో రైతులు ఎమ్మార్వో అంబటి రజితకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి సంబంధించిన నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని ధాన్యం కొనుగోలు సెంటర్ కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం ఆరబోసుకునేందుకు తాము స్థలాన్ని అద్దెకు తీసుకోవాల్సి వస్తుందని అద్దె స్థలంలోనే కొనుగోలు సెంటర్ నడుస్తుందన్నారు. ప్రతిసారి ఉన్న కొద్దిపాటి అద్దె స్థలంలో తాము ధాన్యం ఆరబెట్టేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని తమ సమస్యను ఎమ్మార్వోకు వివరించారు. దీనిపై ఎమ్మార్వో రజిత సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నేరెళ్ళ అయిలయ్య, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



## 26వ డివిజన్‌లో మెడికల్ క్యాంప్ ప్రారంభం

**సూర్య కరీంనగర్**



తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 26వ డివిజన్‌లోని స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ లో మెడికల్ క్యాంప్‌ను కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంట కళ్యాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అలేఖ్య ఆధ్వర్యంలో డాక్టర్లు భరత్ (ఆర్థో), రవి (జనరల్), మౌనిక (ఆప్తమాలజీ), మాధురి (పీడియాట్రిస్ట్), శ్రీలేఖ (గైనకాలజిస్ట్), శరత్ (డెంటల్) నిర్వహించి పేద ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య సూచనలు అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అంజన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమలేష్, శ్రీధర్, ఏఎన్ఎంలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు

**- ఈ నెల 17 వరకు పొడిగింపు**

**సూర్య కరీంనగర్**



జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు ఈ నెల 17వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జాతీ య కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చిన సందర్భంగా ఈ సమయాన్ని పార్టీ కార్యకర్తలు, అభిమానులు సద్వినియోగం చేసుకోవాలని పార్టీ కరీంనగర్ నాయకులు కాస రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా సభ్యత్వం తీసుకునేవారు, ఇప్పటికే సభ్యత్వం ఉన్న వారు రెన్యువల్ చేసుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ ఉద్యమి సభ్యత్వంతో పాటు కార్యకర్తలకు భీమా సౌకర్యాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.5 లక్షలు, రెండు కాళ్లు లేదా రెండు చేతులు కోల్పోతే రూ.5 లక్షలు, ఒక కాలు లేదా ఒక చెయ్యి కోల్పోతే రూ.2.5 లక్షలు, పూర్ణ వైకల్యం కలిగినా రూ.5 లక్షల భీమా వర్తిస్తుందని తెలిపారు. వార్షిక సభ్యత్వ రుసుము రూ.400 మాత్రమేనని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు కోసం పేరు, ఫోటో, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు వివరాలను సూచించిన సెల్: 89781 13833 నంబరు పంపాలని సూచించారు కరీంనగర్ నియోజకవర్గంలో కార్యకర్తలు, పవన్ అభిమానులు అధిక సంఖ్యలో ఉద్యమి సభ్యత్వం తీసుకుని పార్టీని బలోపేతం చేయాలని కోరారు.

## ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు

**సూర్య గన్నేరువరం**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఐదవ రోజు గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామంలో గ్రామ అభివృద్ధి కోసం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గం సహకారంతో మంగళవారం రోజున గ్రామంలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రోడ్ల ను శుభ్రపరచడం మురికి కాలువలలో పేరుకుపోయిన మట్టి చెత్త తొలగింపు చేయడం జరిగింది. అదేవిధంగా కాలువలో బ్లీచింగ్ లైమ్ చల్లి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ అజయ్ వర్మ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రంగా ఉంటే గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అదే నా లక్ష్యమని అన్నారు. అదేవిధంగా గ్రామ అభివృద్ధి నా బాధ్యత అని అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ఎప్పుడు ముందుంటానని అన్నారు.

## ఎండపల్లిలో రోడ్డు ప్రమాదం

**సూర్య ఎండపల్లి**



ఎండపల్లి మండల కేంద్రం కూడలి సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం, టాటా ఏసీ ట్రాలీ ఢీకొని రోడ్డు ప్రమాదం జరిగింది, స్థానికుల కథనం మేరకు మండలంలోని సుధారం గ్రామానికి చెందిన కోడిపెల్లి లింగయ్య (50) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కరీంనగర్ లక్సెట్టిపేట రహదారిపై ఎదురుగా వస్తున్న టాటా ఏసీ ట్రాలీ వాహనం ఢీకొని తీవ్ర గాయాలు కాగా స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

## ప్రజాపాలన, ప్రభుత్వ పథకాలపై

# ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాలి

### - జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా - సర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణ ఏర్పాట్లపై సమీక్ష

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12న సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ లకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కలెక్టర్ కార్యాలయం లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు అమలు చేయడంలో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమని అన్నారు. నూతనంగా ఎన్నికైన వారు సహా, ప్రతి ఒక్కరికీ ఈ కార్యక్రమాలపై అవగాహన ఉండాలని తెలిపారు. అందువల్ల ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రజలకు లబ్ధి చేకూర్చే వివిధ పథకాలు, కార్యక్రమాలు, వాటి అమలు, లబ్ధి పొందే విధానంపై వివరించాలని అన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజా ప్రతినిధుల పాత్ర,పై అవగాహన కల్పించాలని అన్నారు.





99 రోజుల ప్రజా పాలన కార్యాచరణ గురించి స్పష్టంగా తెలిపాలని, ఈ కార్యక్రమంలోని 10 అంశాలు వాటి ప్రాధాన్యతను వివరించాలని అన్నారు. మహిళల, పిల్లల సంరక్షణ చట్టాలు, హెల్ప్ లైన్ నెంబర్లు, ఇందిరమ్మ ఇండ్లు, వాటి పురోగతి, గృహాలకు అందిస్తున్న ఉచిత విద్యుత్తు, విద్య, వైద్య శాఖల్లో అమలు చేస్తున్న నూతన విధానాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ డిడి నాగలేశ్వర్, డి వై ఎస్ ఓ శ్రీనివాస్, హౌసింగ్ శాఖ పిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా ఎడ్యుకేషన్ ఫేర్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ చిత్రా మిశ్రా

**సూర్య కరీంనగర్**

తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలో మార్చి 15వ తేదీ ఆదివారం రోజున మెగా ఎడ్యుకేషన్ ఫేర్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం కరీంనగర్ లోని TNGO ఫంక్షన్ హాల్‌లో జరగనుంది. ఈ సందర్భంగా తెలంగాణ విద్యా సమితి చైర్మన్ తారక్ గౌడ్ మరియు వారి బృంద సభ్యులు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసి మెగా ఎడ్యుకేషన్ ఫేర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ



విద్యార్థులకు ఉన్నత విద్యపై సరైన అవగాహన కల్పించేందుకు ఇలాంటి ఎడ్యుకేషన్ ఫేర్‌లు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ తర్వాత అందుబాటులో ఉన్న వివిధ కోర్సులు మరియు కెరీర్ అవకాశాలపై ఒకే వేదికపై సమగ్ర సమాచారం అందించేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఎడ్యుకేషన్ ఫేర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. తెలంగాణ విద్యా సమితి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి శ్రీనివాస్, కరీంనగర్ టౌన్ అధ్యక్షులు ప్రవీణ్ రాజ్,గణేష్, రాజేష్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### - అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

పదవతరగతి పరీక్షల ఏర్పాట్లపై విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్, ప్రభుత్వ పరీక్షల సంచాలకులు శ్రీహరి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాంతీయ సంచాలకులు, జిల్లా స్థాయి పరిశీలకులు, జిల్లా విద్యాశాఖాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ నుండి అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్వినీ తానాజి వాకడే వీడియో కాన్ఫరెన్సుకు హాజరై మాట్లాడుతూ మార్చి 14వ తేదీ నుండి



ప్రారంభమయ్యే పదవ తరగతి బోర్డు పరీక్షల ఏర్పాట్లలో భాగంగా అన్ని సెంటర్లలో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్ ఏర్పాట్లు చేశామని తెలిపారు. తాగునీరు, తదితర అన్ని వసతులు కల్పిస్తున్నామని, మెడికల్ క్యాంప్ ప్రతి సెంటర్లో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. విద్యార్థులకు రవాణా ఏర్పాట్లు, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 73 పరీక్షా కేంద్రాలలో 13157 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని తెలిపారు.

## EDOS ఆల్ ఇండియా ర్యాంకింగ్స్‌లో అద్విత విద్యార్థుల ప్రతిభ

**సూర్య కరీంనగర్**

భగత్‌నగర్‌లోని అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు EDOS IIT & NEET ఫౌండేషన్-ఇంటిగ్రేటెడ్ ఫోర్ట్‌నైట్ టెస్ట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తి తెచ్చారు. ఈ పరీక్షల్లో విద్యార్థులు 2 గోల్డ్, 2 సిల్వర్, 3 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. గ్రేడ్-7 విద్యార్థిని సహస్ర, గ్రేడ్-8 విద్యార్థిని చైత్ర గోల్డ్ మెడల్స్ సాధించగా, గ్రేడ్-8 విద్యార్థి శ్రేయస్, గ్రేడ్-9 విద్యార్థి విశ్వక్ సేన్ సిల్వర్ మెడల్స్ అందుకున్నారు. గ్రేడ్-6 విద్యార్థిని ఇషాన్వి, గ్రేడ్-7 విద్యార్థులు హృషికేష్, హృతికేష్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. పలువురు విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకింగ్స్‌లో టాప్-100లో స్థానం పొందారు. ఈ సందర్భంగా చైర్మన్ కొమరయ్య సౌగాని, డైరెక్టర్ అనుదీప్ సౌగాని, ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన IIT & NEET ఫౌండేషన్ కోఆర్డినేటర్ కె. సందీప్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



## నూతన నియామకం

**సూర్య కరీంనగర్**



ఆర్‌జీఎన్ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా నలగంటి మల్లేశ్వరిను నియమించారు. ఈ నియామకాన్ని సంస్థ జాతీయ అధ్యక్షుడు దేవానంద నాయుడు, నేషనల్ సెక్రటరీ భూక్య శ్రీనివాస్, నేషనల్ వెల్ఫేర్ సెక్రటరీ ఆకుల చందు ప్రకటించారు. ఈ సందర్భంగా నలగంటి మల్లేశ్వరికి జాతీయ కార్యాలయం ప్రత్యేక అభినందనలు తెలియజేసింది.

## నలుబాలను అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**సూర్య, హుజురాబాద్**

ప్రజలకు రోడ్డు భద్రతా నియమాల పట్ల స్వచ్ఛందంగా అవగాహన కలిగిస్తూ ప్రజోపకరమైన పనులు చేస్తున్న హుజురాబాద్ పట్టణానికి చెందిన సామాజికవేత్త నలుబాల వేణుగోపాల్ ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అభినందించారు. మంగళవారం హుజురాబాద్ పట్టణంలో ఆయన పర్యటన సందర్భంగా నలుబాల వేణు గోపాల్ రోడ్డు భద్రత నియమాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన చేస్తున్న ప్రచారాన్ని గుర్తించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సమాజానికి ఉపయోగపడే పని చేస్తున్నావని, మరింత ప్రజలను చైతన్యవంతం చేయాలని వేణుగోపాల్ ను మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వెంట ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఆర్డీఓ రమేష్ బాబు, తహశీల్దార్ నరేందర్, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, వైస్ చైర్ పర్సన్ గూడూరి అంజలి, కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ తదితరులు ఉన్నారు.




## విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి

### - ఎస్.ఈ గంగాధర్

**సూర్య కరీంనగర్ టౌన్**



కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. గంగాధర్ విద్యుత్ వినియోగదారులు, ముఖ్యంగా రైతులు విద్యుత్ పనుల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ స్వయంగా విద్యుత్ పనులు చేయకూడదని, విద్యుత్ లైన్ల సమీపంలో వ్యవసాయ లేదా నిర్మాణ పనులు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వర్షాలు, గాలివానల సమయంలో తీగలు తెగి పడే అవకాశం ఉండడంతో అలాంటి పరిస్థితులు కనిపించిన వెంటనే సంబంధిత ఏఈ లేదా లైన్ మెన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. తడి విద్యుత్ తీగలు, స్థంభాలను తాకరాదని హెచ్చరించారు. ఇళ్లలో సురక్షితమైన వైరింగ్ ఉండేలా చూసుకోవాలని, రైతులు మోటార్లు మరియు స్విచ్ బోర్డుల వద్ద ఎర్తింగ్ సరిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సమస్యలు ఎదురైన వెంటనే TGNPDCL టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

## ఆత్మవిశ్వాసం విజయానికి తొలి మెట్టు

### - ధనపురి సాగర్

**సూర్య కరీంనగర్ టౌన్**




హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ లోనీ గంజ్ హై స్కూల్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులకు సంస్థ సభ్యుడు నక్క రాఘవేందర్ కూతురు నక్క జ్ఞానతిక జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేయడం జరిగిందని సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలని, పరీక్షలను పండుగలాగా భావించాలని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునని, ఇతర విద్యార్థులతో పోల్చుకోకుండా, ఒత్తిడిని జయిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. అలాగే ప్రశ్నపత్రంను చదివి అర్థం చేసుకొని సమాధానం రాయడానికి పూనుకోవాలని సూచించారు. రాబోవు వార్షిక పరీక్షలో ఏ విద్యార్థి అయితే 555 పై మార్కులు సాధిస్తారు వారికి సంస్థ పక్షాన 2016 నగదు పారితోషికం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి సంస్థ కార్యదర్శి తోడుపునురీ తిరుపతి సభ్యులు నక్క రాఘవేందర్, ముని గోపాల్, మణికంట టి. శ్రీరామ్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దిగుళ్ళ సతీష్ సగర అనారోగ్యంతో మరణించారు. మంగళవారం విషయం తెలిసి రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పోతుల నర్సయ్య హుటాహుటిన వెళ్లి మృతి పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ సహాయం నిమిత్తం మృతుడి భార్యకు రూ. 2000 అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆయన వెంట వార్డ్ మెంబర్ గుంటి తిరుపతి, గుంటి రాజయ్య, బొడిపల్లి శ్రీను, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

# మార్చి 12న స్థానిక ప్రజాప్రతినిధులకు శిక్షణ

**- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు - ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

**- పాల్గొన్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ - తంగళ్లపల్లి వ్యవసాయ కళాశాలలో శిక్షణకు ఏర్పాట్లు పూర్తి**

**సూర్య రాజన్న సిరిసిల్ల,**

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జిల్లాలోని సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, వార్డు సభ్యులకు ఈ నెల 12వ తేదీ గురువారం శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి పంచాయతీ రాజ్, మున్సిపల్, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సిరిసిల్ల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఈ సమీక్షలో పాల్గొన్నారు. సమన్వయంతోనే ఉత్తమ ఫలితాలు ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షిస్తున్నారని గుర్తుచేశారు. ఈ శిక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు, కేంద్ర పథకాలపై స్పష్టమైన అవగాహన



కల్పించాలని,శిక్షణ ప్రారంభోత్సవానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలన్నారు.కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని,వేదిక వద్ద జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన ఫైళ్ల క్లియరెన్స్, పారిశుధ్య కార్యక్రమాలపై కలెక్టర్లను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

**- జిల్లెల్లలో శిక్షణకు సర్వం సిద్ధం:**

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ,జిల్లాలో శిక్షణకు అన్ని




ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని వ్యవసాయ కళాశాలలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్, మున్సిపల్, పంచాయతీ రాజ్ చట్టాలపై ప్రజాప్రతినిధులకు పీపీటీల ద్వారా అవగాహన కల్పిస్తామని వివరించారు. ఇప్పటికే జిల్లాలో వైద్య శిబిరాలు, విద్యార్థులకు ఒత్తిడి నియంత్రణ తరగతులు, కార్యాలయాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయని ఆమె పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఓ గీత, జడ్పీ సీఈఓ వినోద్ కుమార్, సెస్ ఎండీ భిక్షపతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాము తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మంగళవారం రోజున జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ దరూర్ క్యాంప్ లో గల ఈవీఎం లను భద్రపరిచిన గోదామును తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెల ఈవీఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సిసి కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు.గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు.ఈ పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, కలెక్టరేట్ ఏవో హకీమ్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రసమయి కట్టించారనేనా నిర్లక్ష్యం..?

**- తిమ్మాపూర్ విగ్రహావిష్కరణపై పెరిగిన సెగ**

**సూర్య, తిమ్మాపూర్**



మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు అంబేద్కర్ ఆశయాల పట్ల, మహనీయుల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే..వెంటనే తిమ్మాపూర్ బస్టాండ్ వద్ద సిద్ధంగా ఉన్న విగ్రహాలను ఆవిష్కరించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తిమ్మాపూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు .తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఆర్టీసీ బస్టాండ్ వద్ద గత ప్రభుత్వ హయాంలో (మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కాలంలో) మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.అయితే, విగ్రహాల ఏర్పాటు పూర్తయి నెలలు గడుస్తున్నా, నేటికీ వాటిని ముసుగు ల్లోనే ఉంచడంపై దళిత సంఘాలు మండిపడ్డాయి. గత ఎమ్మెల్యే వీటిని నెలకొల్పారనే సాకుతోనే ప్రస్తుత ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వాటి ఆవిష్కరణను తాత్సారం చేస్తున్నారని వారు ఆరోపించారు.రాజకీయ పంతాల కోసం మహనీయులను అవమానించడం సరికాదు. వెంటనే ఆ ముసు గులను తొలగించి, గౌరవప్రదంగా విగ్రహావిష్కరణ చేయాలి. ఇప్పటికైనా ఎమ్మెల్యే అందరినీ కలుపుకుని ఐకమత్యంతో ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని నాయకులు సూచించారు.లేనిపక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో దీటీం పార్టీ దళిత నాయకులు బోయిని కొమురయ్య, వంతడుపుల సంపత్, సంగుపట్ల మల్లేశం, వడ్లూరి శంకర్, ఖమ్మం కృష్ణ, బోయిని తిరుపతి మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## కల్వకుంట్ల కవిత అరెస్ట్ అక్రమం

**సూర్య, సెంటినరీ కాలనీ**



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఢ హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను అరెస్టు చేయడాన్ని హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. గత సోమవారం నాడు ఖమ్మం జిల్లా వెలుగుమట్ల గ్రామంలో పేదల ఇండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేయడాన్ని నిరసిస్తూ బాధితులను పరామర్శించడానికి వెళ్లిన కవితను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో నిర్బంధించడం కాంగ్రెస్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఖమ్మం జిల్లాలో పేదల ఇండ్లు నిర్మించుకొని జీవిస్తున్న పేదల ఇండ్లను హైడ్రా పేరుతో నిర్ధాక్షిణంగా కూల్చివేయడం సరైంది కాదని, రేవంత్ సర్కార్ రాజకీయ ప్రత్యర్థుల మీద మరియు బీద మధ్యతరగతి ప్రజలను టార్గెట్ చేసి ఇండ్లను కూల్చివేత కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పెట్టుబడుదారులు-వ్యాపారస్తులు వారికి అనుకూలమైన రాజకీయ నాయకులు బఫర్ జోన్లకు విరుద్ధంగా చెరువుల ఆక్రమించి వ్యాపార సముదాయాలను నిర్మిస్తే వాటి జోలికి వెళ్లకుండా కేవలం సామాన్య ప్రజలను హైడ్రా పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. పేదల పక్షాన పోరాడుతున్న కల్వకుంట్ల కవిత ను అడ్డుకుని అరెస్టులు కొనసాగిస్తుందని, వెంటనే అరెస్టులను మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గోసిక అశోక్, సెంట్రల్ కమిటీ నెంబర్ ఇస్మాయిల్, ఆర్జీ-3 ఏరియా వైస్ ప్రెసిడెంట్ కొమ్ము మధునయ్య, ఏపిఎ వైస్ ప్రెసిడెంట్ శాంతిస్వరూప్, ఏఎల్ పి బ్రాంచ్ సెక్రటరీ గోసిక శ్రీకాంత్, ఏఎల్ పి ఫిట్ సెక్రటరీ రేవల్లి రాజశేఖర్, నవీన్, కిరణ్, అంజి, రవి పాల్గొన్నారు.



## మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కౌన్సిలర్ లకు సన్మానం

**సూర్య మెట్‌పల్లి:-**

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ లుగా గెలుపొందిన మున్నూరు కాపు ప్రజాప్రతినిధులకు గోల్ హనుమాన్ మున్నూరు కాపు సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని సంఘ భవనం లో నిర్వహించిన కార్యక్రమ ంలో వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ తో పాటు కౌన్సిలర్ లు బొడ్ల రమేష్, నునుగొండ నరేష్, మాసుల ప్రవీణ్, బొడ్ల ఆనంద్, నాయకులు ధోనికెల నవీన్, బొడ్ల నగేష్ అరిగెల రాకేష్ లను శాలువాతో సన్మానించి సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కౌన్సిలర్ లు మాట్లాడుతూ పట్టణంలోని మున్నూరు కాపు కుటు ంబాలకు ఏ ఆపద వచ్చినా తాము ముందుండి సహకరిస్తామని తెలిపారు. అలాగే పట్టణంలోని అన్ని కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సంగు గంగాధర్, ఓల్లాడపు లింబాద్రి, బొడ్ల రాజేందర్, ఎశమేని గణేష్, బూరుగు గంగారెడ్డి బొడ్ల రాహుల్, జెట్టి రాజు, సంగు ప్రతాప్, కోట దుర్గరాజు, నోముల శివ, , వంగరాజు, బోయిని హనుమండ్లు, ఆకుల మారుతి షేర్ నర్సారెడ్డి, పూప్పల నగేష్ తదితర కులసంఘ సభ్యులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రధానం

**సూర్య వెల్లటూర్**



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో15 రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం తో ముగిసింది.ఫైనల్ మ్యాచ్ లో ముత్తునూర్ టీం మొదటి బహుమతి గెలుపొందింది. రెండవ విజేతగా మొకట్రావుపేట జట్టు నిలిచింది. ఈ టోర్నమెంట్ లో గెలుపొందిన విజేతలకు స్థానిక సర్పంచ్ బండమీద కవిత-గోపి బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో వెల్గటూర్ భక్తఅంజనేయ ఆలయ కమిటీ చైర్మన్ మెరుగు నరేష్ గౌడ్,బండారి రాజేందర్,ఆర్గనైజర్ వడుకాపురం రాజు,ఎనగందుల నరేష్,ఉపసర్పంచ్ అక్రమ్,శ్రీను,శ్రవణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమం.

**- శివపల్లిలో పశువులకు టీకాలు 252 వేశారు.**

**సూర్య - ఎలిగేడు**



ఎలిగేడు మండలంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతున్నట్లు పశు వైద్యురాలు ఝాన్సీ తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుండి వచ్చే నెల 4వ తేదీ వరకు మండలంలోని 12 గ్రామాల్లో పశువులకు ఈ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం శివపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 252 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుగ్యాల వాణి,వెటర్నరీ అసిస్టెంట్ పి.శంకర్, గోపాలమిత్రం పి. సమ్మయ్య, పాడి రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

**- జువ్వాడి బ్రదర్స్**

**- పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు**

**సూర్య కోరుట్ల**



కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు, సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం కోరుట్ల పట్టణంలోని కింగ్స్ గార్డెన్‌లో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.ఈ సందర్భంగా జువ్వాడి సోదరులు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ మాట్లాడారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని, పేద, వెనుకబడిన తరగతుల అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగుతోందని అన్నారు. ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ మహమ్మద్ షాహేద్ ఉల్ అహ్మద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొంతం రాజం, మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎంఏ నయీమ్ పాల్గొన్నారు.?అదేవిధంగా పట్టణంలోని పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున మైనార్టీ సోదరులు పాల్గొని ప్రార్థనల అనంతరం కార్యక్రమంలో పాల్గొన్నారు..

# బోనాల వేడుకలకు ముస్తాబవుతున్న పోచమ్మ తల్లి ఆలయం

## - భక్తులకు అసౌకర్యం లేకుండా చలువ పందిళ్లు - సర్పంచ్ పాతకుల అనూష ప్రత్యేక చొరవ

**సూర్య,జూలపల్లి**

ఉగాది పండుగ సందర్భంగా పోచమ్మ తల్లి ఆలయంలో నిర్వహించే బోనాల సమర్పణ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలి వచ్చే నేపథ్యంలో ఆలయ ఆవరణలో మంగళవారం చలువ పందిళ్లు ఏర్పాటు చేయించారు. గ్రామంలోని భక్తులు ఎండ తీవ్రతకు గురికాకుండాచలువ పందిళ్ల నీడలో సౌకర్యంగా బోనాలు సమర్పించుకునేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు గ్రామ సర్పంచ్ పాతకుల అనూష తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పోచమ్మ తల్లి ఆలయంలో ప్రతి సంవత్సరం బోనాల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో



నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు వేయించి తాగునీరు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాతకుల అనూష మాట్లాడుతూ భక్తులు సౌకర్యంగా పూజలు నిర్వహించుకునేందుకు గ్రామపంచాయతీ తరఫున అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. భక్తులు శాంతియుతంగా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. బిఆర్ఎస్ నాయకులు,సింగిల్ విండో మాజీ చైర్మన్ లోక రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాతకుల అనిల్, మద్దపల్లి శ్రీనివాస్,ఎగుర్ల రవి,గ్రామ కుల సంఘాల పెద్దలు, యువకులు, భక్తులు ఏర్పాట్లను ప్రశంసించారు.

# హౌస్ కీపింగ్ కార్మికుల సమయపాలన పాత పద్ధతి కొనసాగించాలి

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) ఆర్జీ-2 డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో హౌస్ కీపింగ్ కార్మికుల సమయ పాలనను పాత పద్ధతిలో కొనసాగించాలని, ఫిబ్రవరి-12వ తేదీన సమ్మె కాలంలో కార్మికుల పై వేస్తున్న పెనాల్టీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్జీ-2 జీఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం బండి వెంకటయ్య కి వినతి పత్రం అందచేశారు. అనంతరం సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న మాట్లాడుతూ ఆర్జీ-2 డివిజన్ పరిధిలో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికులు ఉదయం 5:30 గంటల నుండి మధ్యాహ్నం 01.30 గంటల వరకు ఎలాంటి ఇబ్బందులు




లేకుండా వారి పనులు వారు నిర్వహిస్తున్నారని, కొత్తగా వచ్చిన ఎస్ఈ బాలరాజ్ అనే అధికారి వీరి యొక్క సమయపాలనను మారుస్తూ ఉదయం 6:00 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు డ్యూటీ చేయాలని కార్మికులను వేధిస్తూ సమయపాలనను మార్చాడని తెలిపారు. దీని వలన హౌస్ కీపింగ్ కార్మికులు వారి యొక్క విధులకు విఘాతం కలిగే విధంగా ఈ అధికారి బెదిరింపు చర్యలు పాల్పడుతున్నాడని, తక్షణమే యాజమాన్యం బాలరాజు అనే ఎస్ఈ అధికారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలో సమయ పాలన ను కొనసాగించాలని, అలాగే సమ్మె కాలంలో కార్మికులకు విధించిన పెనాల్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకులు ఈ.నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.అశోక్, రాష్ట్ర నాయకులు ఐ. రాజేశం, ఈదునూరి రామకృష్ణ, డి.బుచ్చమ్మ, బండ పద్మ, కుందారపు శారద, ఈ మేరీ, ఎస్.ప్రసాద్, జే.నిర్మల, దుర్గం లక్ష్మి, అనసూయ, ఎం లక్ష్మి, ప్రేమ్ కుమార్, గుండు పద్మ, సరూప, లత తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను ప్రమర్శించిన కర్ణకంటి మంజుల రెడ్డి.

## - అధైర్యపడొద్దు అండగా ఉంటామన్న మంజుల అక్క.

**సూర్య చిగురుమామిడి**

చిగురుమామిడి మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన జంగాపల్లి రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి



చెందగా,దురిశెట్టి రాజు అనే యువకుడు బావిలో పడి ఆత్మహత్య చేసుకొని మృతిచెందగా అట్టి విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు,ప్రముఖ సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజుల రెడ్డి మంగళవారం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అనంతరం వారి మృతికి గల కారణాలను వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని ఓదార్చారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారన,బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని మంజుల రెడ్డితో విలపించారు. కొండాపూర్ గ్రామంలో ఇద్దరి యువకుల మృతి తనను తీవ్రంగా కలిసిందని మంజుల రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామ ఉపసర్పంచ్ మాచర్ల శ్రీనివాస్,కళాకారుడు మాచర్ల సృజన్ ల తల్లి మాచర్ల కనుకవ్వ ఇటీవల అకాల మరణాన్ని చింతిస్తూ వారి పవిత్ర ఆత్మశాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబాన్ని ఓదార్చారు. హుస్నాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చావుల రాజయ్య సతీమణి సావుల విజయ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట సర్పంచ్శ్రీ ఫోరం చిగురుమామిడి మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్, మంజుల అక్క యువసేన హుస్నాబాద్ నియోజకవర్గ బాధ్యులు రవీందర్ రెడ్డి, కొండాపూర్ గ్రామ ఉపసర్పంచ్ బింగి రాజేంద్రప్రసాద్, వార్డు సభ్యుడు రెడ్డి ఐలయ్య,గ్రామ యువకులు మంజులక్క యువసేన సభ్యులు ఉన్నారు.

# రైతులు సేంద్రీయ ఎరువులను ఉపయోగించాలి

## - ఏడిఏ సునీత

**సూర్య, హుజురాబాద్ రూరల్**

రైతులు రసాయనిక ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని హుజురాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకులు గుండా సునీత అన్నారు. మంగళవారం హుజురాబాద్ మండలం సింగాపూర్ క్లస్టర్ రైతు వేదిక లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నూతన వ్యవసాయ విధానాలను రైతులు అలవర్చుకోవాలన్నారు. పచ్చిరొట్ట పంటలు, పప్పు దినుసులు పొలంలో కలియదున్ని జీవన ఎరువులను వాడడం వల్ల భూమి యొక్క కర్బన శాతం పెంచుకోవచ్చు అని, పోషకాల లభ్యతను  మెరుగుపరుచుకోవచ్చని అన్నారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త  శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... రైతులు కృత్రిమ ఎరువుల వాడకాన్ని తగ్గించి సహజ వనరులను ఉపయోగించుకొని సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులను తక్కువ ఖర్చుతో అధిక లాభాలను పొందాలని అన్నారు. రైతులు జీవన ఎరువులు అయినటువంటి అజొస్పైరులం ఫాస్ఫరస్ బ్యాక్టీరియా, పొటాషియం మోబిలైజింగ్ బ్యాక్టీరియా వంటి సహజ ఉత్పత్తులను వాడి ఎరువుల కృత్రిమ ఎరువులను తగ్గించుకోవడం పంట సంరక్షణకై పంచగవ్య, దశపత్రి కషాయం వేపకషాయము లాంటివి వాడుకోవాలని అన్నారు. ఏఓ భూమిరెడ్డి మాట్లాడుతూ... శిలీంద్ర నాశనం ట్రైకోడెర్మాభిరెడ్డి  సుడోమోనాస్ వాడకము, వాటి లాభాల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బిటిఎం స్రవంతి, ఏఈఓ సౌమ్య, గ్రామ ఉప సర్పంచ్ నారాయణ రెడ్డి, ఏఈఓ నిఖిల్, రైతులు పాల్గొన్నారు.



# తులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పంపిణీ

**సూర్య పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు రైతులకు రోటోవేటర్లు, గడ్డి కట్టలు కట్టే యంత్రాలను పంపిణీ చేశారు. పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన రైతులకు మొత్తం 103 యూనిట్లకు గాను రూ.1.11 కోట్ల విలువైన సబ్సిడీ పరికరాలు అందజేస్తుండగా, మొదటి విడతలో 63 మంది రైతులకు పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలు అందించడంతో వ్యవసాయం సులభతరం అవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ పరికరాల పంపిణీ కొనసాగిస్తామని తెలిపారు. రైతులు నానో యూరియా, నానో డిఏపీ, నానో పొటాష్ ఎరువులను వినియోగించాలని సూచించారు. అలాగే కేజీ వీల్స్ ట్రాక్టర్లు రోడ్లను దెబ్బతీస్తున్నాయని, వాటికి పట్టీలు అమర్చాలని తెలిపారు. నిబంధనలు పాటించని ట్రాక్టర్లపై జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏడీఏ శ్రీనాథ్, మార్కెట్ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.




# హమాలి మహా గర్జన పోస్టర్ ఆవిష్కరణ

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 15న హనుమకొండలో నిర్వహించనున్న హమాలి మహా గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లన్న తో కలిసి మంగళవారం మహా సభల పోస్టర్ ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కా నిండని కాయ కష్టం చేసే హమాలీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హమాలి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు సంక్షేమం కోసం ఈ మహా గర్జన కార్యక్రమం ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు అయితే ప్రభుత్వం నుంచి అందుకు తగిన నిధులు సమకూర్చినట్లయితే హమాలీల కుటుంబాలకు ఆసరాగా ఉంటుందని, హమాలీలకు తగిన వేతనాలు, భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. హమాలి కార్మికుల జీవన పరిస్థితులు మెరుగుపడాలంటే కార్మికులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. మార్చ్ 15వ తేదీన పెద్దపల్లి జిల్లాలోని హమాలి కార్మికులు, యూనియన్ లకు, పార్టీలకు అతీతంగా హమాలీ పని చేసే ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా హనుమకొండ పట్టణంలోని కాళోజి కళాక్షేత్రం హయగ్రీవచారి గ్రౌండ్ కు తరలి వెళ్లి హమాలి మహా గర్జన కార్యక్రమాన్ని ఘన విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నేడి వెంకట్ రెడ్డి, సంఘం లీగల్ అడ్వైజర్, కార్మిక నాయకులు, ఏజి పి, ఉప్పు రాజన్న, జిల్లా బాధ్యులు జంగా సంపత్ యాదవ్, కొమ్ము భూమయ్య, కొలిపాక సదయ్య, శంకర్, ప్రభాకర్ హమాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాము తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మంగళవారం రోజున జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ దరూర్ క్యాంప్ లో గల ఈవీఎం లను భద్రపరిచిన గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెల ఈవీఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సిసి కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు. గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, కలెక్టరేట్ ఏవో హకీమ్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్  తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసీ లో ఘనంగా సీఐఎస్ఎఫ్ 57వ రైజింగ్ డే వేడుకలు

**సూర్య-గోదావరిఖని:**

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) 57వ రైజింగ్ డే వేడుకలను మంగళవారం ఆర్ఎస్టీపీఎస్ రామగుండంలోని సీఐఎస్ఎఫ్ యూనిట్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ సిబ్బంది పరేడ్ గ్రౌండ్లో సాంప్రదాయిక సెరిమోనియల్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీపీసీ (రామగుండం, తెలంగాణ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంతా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు సీఐఎస్ఎఫ్ కమాం డెంట్ చంచల్ సర్కార్, డిప్యూటీ కమాండెంట్లు ఎస్.ఏ.రాజు, ఓ.వి.కె.ఎస్.శాస్త్రి స్వాగతం పలికారు. పరేడ్ గ్రౌండ్ను ప్రత్యేకంగా



అలంకరించి నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది క్రమశిక్షణ, సమన్వయం, నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ పరేడ్లో పాల్గొన్నారు. అనంతరం సిబ్బంది రూమ్ ఇంటర్వెన్షన్ డెమో నిర్వహించి తమ ఆపరేషనల్ సిద్ధతను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి చందన్ కుమార్ సమంతా బెస్ట్ పరేడ్ కమాండర్, బెస్ట్ ప్లాటూన్కు బహుమతులు అందజేసి వారి ప్రతిభను అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ మేనేజ్మెంట్ సీనియర్ అధికారులు, సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దేశంలోని కీలక పరిశ్రమల భద్రత కోసం సీఐఎస్ఎఫ్ అందిస్తున్న సేవలను వారు ప్రశంసించారు. సీఐఎస్ఎఫ్ దేశంలోని ముఖ్యమైన పరిశ్రమలు, సంస్థల భద్రతలో కీలక పాత్ర పోషిస్తూ నిబద్ధత, ధైర్యం, ప్రొఫెషనలిజంతో సేవలందిస్తున్నదని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.

## బొగ్గు రవాణా లక్ష్యాన్ని సాధించిన జిడికె ఓసి-5 ప్రాజెక్ట్

**-20 రోజుల ముందుగానే 100 శాతం టార్గెట్ పూర్తి**

**-జీఎం డి.లలిత్ కుమార్ అభినందనలు**

**సూర్య-గోదావరిఖని**




సింగరేణి కాలరీస్ కంపెనీకి చెందిన రామగుండం ఏరియా-1 పరిధిలోని జిడికె ఓసి-5 ప్రాజెక్ట్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన బొగ్గు రవాణా లక్ష్యాన్ని ఉద్యోగులు విజయవంతంగా సాధించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 32 లక్షల టన్నుల రవాణా లక్ష్యానికి గాను 32 లక్షల 7 వేల టన్నుల బొగ్గు రవాణా చేసి 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు. ముఖ్యంగా ఈ రికార్డును 20 రోజుల ముందుగానే సాధించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా ఆర్జీ-1 జీఎం డీ.లలిత్ కుమార్ ఓసి-5 ప్రాజెక్ట్ ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, సూపర్వైజర్లు, అధికారులు, యూనియన్ ప్రతినిధు లను అభినందించారు. అందరి సమిష్టి కృషి ఫలితంగానే ఈ అద్భుత విజయాన్ని సాధించగలి గామని తెలిపారు.ఈ విజయాలు ఆర్జీ-1 ఏరియా కు గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ఇది స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలను కూడా అధిగమించాలని ఉద్యోగులను ఆయన కోరారు. ఓసి-5 ప్రాజెక్ట్ సాధించిన ఈ విజయంతో సింగరేణి సంస్థ ప్రతిష్ట మరింత పెరిగిందని అధికారులు తెలిపారు.

## శ్రీరాంపూర్ నుండి హైదరాబాద్ కు బస్సు సౌకర్యం ప్రారంభం

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం శ్రీరాంపూర్ మండల కేంద్రం నుండి హైదరాబాద్ వరకు నూతన బస్ సౌకర్యాన్ని ఆర్టీసీ అధికారులు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే విజయ రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో నుండి ఉదయం 8.15 నిమిషములకు బయలుదేరి మధ్యాహ్నం జూబ్లీ బస్టాండ్ కు 1.30ని. చేరుతుందని తిరిగి మధ్యాహ్నం 2.00 లకు బయలుదేరి రాత్రి 7.00 లకు శ్రీరాంపూర్ చేరుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో గంగయ్య స్థానిక సర్పంచ్ బంగార్ రమేష్ మాజీ ఎంపీపీ గోపాలు సారయ్య గౌడ్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి వైస్ చైర్మన్ సబ్బని రాయమల్లు పార్టీ మండల అధ్యక్షుడు గాజన వేణి సదయ్య మాజిజెడ్పిటిసిలు ఎంపీటీసీలు సర్పంచ్లు ఉప సర్పంచ్లు మరియు పార్టీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



మహిళలు, బాలికలు చదువుకుం టేనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్, బీసీ జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్ కోమటిపెల్లి రాజేందర్ పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి సందర్భంగా పెద్దపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, బాలికల విద్యాభివృద్ధి కోసం సావిత్రిబాయి పూలే విశేషంగా కృషి చేశారని అన్నారు. సమాజంలో ఉన్న బాల్య వివాహాలు, అంటరానితనం, కుల వివక్షత వంటి అన్యాయాలకు వ్యతిరేకంగా ఆమె పోరాడిన గొప్ప సామాజిక సంస్కర్త అని కొనియాడారు. మహారాష్ట్రలో ప్లేగు వ్యాధి వ్యాపించిన సమయంలో రోగులకు సేవలందిస్తూ ఆమె ప్రాణాలు కోల్పోయిందని తెలిపారు. ఆమె ఆశయాలు, సిద్ధాంతాల మార్గంలో నడవడం ద్వారా ఆమెకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య, జిల్లా నాయకులు కె. రాజు, బీసీ సమితి నాయకులు కీర్తి రాజయ్య, రాజేశం, అమర్ పాల్గొన్నారు.

## దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**




దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ మంగళవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పెద్దపల్లి జిల్లా బృందం జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శనిగరపు మల్లేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నూరి బాబు మాట్లాడుతూ ప్రభుత్వం నెరవేర్చాల్సిన పలు డిమాండ్లను స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి అర్హులైన కుటుంబానికి మూడు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చి పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. విద్యా హక్కు చట్టం ప్రకారం కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం ఉచిత విద్యను అమలు చేయాలని, ఎస్సీ కార్పొరేషన్ శాఖకు 15 వేల కోట్ల నిధులు కేటాయించి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో వైకుంఠధామాలు, కబరస్థానాల పేరుతో దళితుల నుంచి సేకరించిన అసైన్డ్ భూములను తిరిగి వారికి అప్పగించాలని వారు కోరారు. పారిశుధ్య కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి 20 వేల వేతనం అందించాలని, తోళ్ల పరిశ్రమల శాఖకు 10 వేల కోట్ల నిధులు కేటాయించి మాదిగ యువతకు ఉపాధి కల్పించాలని వారు విన్నవించారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పెద్దపల్లి జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి 99 రోజుల కార్యక్రమం లో కలెక్టర్ పర్యటన

**సూర్య ఓదెల**

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఓదెల మండలం లోని కొలనూర్ గ్రామంలో 99 కార్యక్రమంలో పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలందరూ బాగస్వాములు కావాలని కోరారు. పరిశుభ్రత పారిశుద్ధ్యం, ఆరోగ్యం తదితర అంశాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ పల్లె కనకయ్య, ఉప సర్పంచ్ పాకాల సంపత్ రెడ్డి ,మాజీ సర్పంచ్ ఢిల్లీ శంకర్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు బైరి రవి, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## అవయవ దానంతో చిరంజీవిగా నిలిచిన రాహుల్

**సూర్య, హుజురాబాద్**



ఇటీవల హైదరాబాద్ లో జరిగిన రోడ్డు ప్రమాద ంలో గాయపడి మృతి చెందిన హుజురాబాద్ పట్టణానికి చెందిన బొగ్గుల రాహుల్ తన అవయవ దానం చేసి మరి కొంత మందికి బ్రతుకు నిచ్చి చిరంజీవి అయ్యాడు. వివరాల్లోకెళితే... ఈనెల 7న రాజ్ భవన్ రోడ్ లో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మూడు రోజుల పాటు చికిత్స పొందిన రాహుల్ బ్రెయిన్ డైడ్ అయ్యిందని డాక్టర్లు ప్రకటించారు. ఎప్పుడూ అందరితో కలిసి మెలిసి నవ్వుతూ నవ్విస్తూ... అందరికీ సహకారంతో ఉండే రాహుల్ మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. తల్లిదండ్రులు రాజేశం - అనురాధ తమ కుమారుడు రాహుల్ మృతి చెందిన దుఃఖాన్ని దిగమింగుకొని ఆయన మంచితనం అతడు మృతి చెందిన పది మందికి గుర్తుండే విధంగా అవయవ దానానికి అంగీకరించారు. జీవన్ ధన్ ద్వారా అతని అవయవాలైన రెటినా, గుండె, మూత్ర పిండాలు, లివర్ లను అందజేశారు. కాగా మంగళవారం రాహుల్ అంత్యక్రియలు హుజురాబాద్ లో కుటుంబ సభ్యుల, బంధుమిత్రుల కన్నీళ్ల మధ్య జరిగాయి. రాహుల్ మృతి చెందిన దుఃఖాన్ని దిగమింగి అవయవ దానం చేయడానికి ముందుకు వచ్చిన రాహుల్ కుటుంబ సభ్యులను కౌన్సిలర్ వెంకట్ నాయక్, నాయకులు శ్రీనివాస్, గోపి, చింతల రమేష్ అభినందించారు.

## ఆర్జీ-2 డివిజన్ లో 18న మహిళా దినోత్సవం

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థ రామగుండం-2 వ ఏరియా ఎన్ సివోఎ క్లబ్ లో ఈ నెల 18 వ తేదిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపనున్నట్లు అధికార ప్రతినిధి అరవింద్ రావు (ఏజీఎం పర్సనల్) ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అధికారుల సతీమణులకు ఈ నెల 13వ తేదిన ఉదయం 10.00 గం.లకు ఎన్ సిఒఎ క్లబ్ నందు, జీఎం కార్యాలయం నందు సాయంత్రం 4.00 గంటలకు సింగరేణి సంస్థ మహిళా ఉద్యోగినులకు, ఈ నెల 14 తేదిన సంస్థ ఉద్యోగస్థుల సతీమణులకు, కాలనీ మహిళలకు సీఈఆర్ క్లబ్ నందు ఆటల పోటీలు నిర్వహించబడునని తెలియజేశారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**సూర్య వెల్గటూర్**

పాడి రైతులు తమ పశువుల కు తప్పనిసరిగా గాలికు ంటు వ్యాధి నివారణ టీకాలు వేయి ంచాలని వెంకటాపూర్ సర్ప ంచ్ బిళ్లకూరి తిరుపతి అన్నారు. మండలంలోని వెంకటా పూర్ గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బిళ్లకూరి తిరుపతి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు.పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు.ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ సందర్భంగా వైద్యా సిబ్బంది పాడి రైతులకు పశువుల గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లం శ్రీనివాస్, పశువైద్య సిబ్బంది సంధ్య,నాగరాజు, నారాయణ, రాంకుమార్, చంద్రయ్య, అంజి పాల్గోన్నారు.

## సెపక్ తక్రా ఆటలో ప్రతిభ చాటిన వీణాదారి విద్యార్థులు

**సూర్య చొప్పదండి**



తీగలగుట్టపల్లి జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో నిర్వహించినటువంటి ఖేలో ఇండియా అస్మిత ఉమ్మడి కరీంనగర్ జిల్లా సెపక్ తక్రా లీగ్ 2025-26 లో చొప్పదండి చెందిన వీణాధరి హై స్కూల్ క్రీడాకారిణిలు ప్రథమ స్థానం, మరియు గోల్డ్ మెడల్ సాధించారు..గెలుపొందిన క్రీడాకారిణిలను కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్,, తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి,, కరీంనగర్ జిల్లా జనరల్ సెక్రెటరీ గన్ను విజయ



భాస్కర్ రెడ్డి పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్, పిఈటీ మరియు ఉపాధ్యాయ బృందం బహుమతులు అందజేసి, అభినందించారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ముందంజ

**-జీఎం బండి వెంకటయ్య**

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థలో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ముందంజలో ఉంటుందని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. మంగళవారం ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులతో జీఎం బండి వెంకటయ్య స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. పెంచికల్ పేట్ శ్మశాన వాటికలో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి స్నానాల గదులను నిర్మించాలని, ఎస్ అండ్ పిసి చెక్ పోస్టుల వద్ద వేసవి కాలం రానున్న దృష్ట్యా ఆర్జీ-1 ఏరియా మాదిరిగా ఆర్జీ-2 నందు ఏసి లను ఏర్పాటు చేయాలని, ఆర్జీ-2 ఏరియా కార్మికులందరికి సిఎంపిఎఫ్ చిట్టీలు అందించాలని, జిఎం ఆఫీస్, ఓసీపీ-3, పిఓ ఆఫీస్, వికేపి, సిహెచ్ పి యందు 2011 సంవత్సరపు 13 జనరేషన్ సిస్టం లతో పనిచేయడం ఇబ్బందిగా ఉంది కనుక న్యూ జనరేషన్ సిస్టమ్




లను ఏర్పాటు చేయాలని,ఓసిపి-3 ప్రాజెక్ట్ యందు ఈపి ఫిట్టర్ లు, ఎలక్ట్రీషియన్స్ లకు డి టు సి, సి టు బి, బి టు ఏ లుగా ఐఈడీ నార్మ్స్ ప్రకారం యాక్టింగ్ ఇవ్వాలని, ఆర్జీ-2 ఏరియా లోని రూఫ్ లీకేజీ ఉన్న అన్ని టి-2 క్వార్టర్లకు డాంబర్ షీట్స్ వేయించాలని, కాలని లోని నిరుపయోగంగా ఉన్న క్వార్టర్లకు వాటర్ లైన్ డమ్మీ వేయించాలని, ఫిల్టర్ బెడ్లకు ఉన్న లీకేజీ లను అరికట్టాలని, వేసవికాలం దృష్ట్యా కార్మికులకు నీటి సదుపాయంలో అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, కాలనీలోని క్వార్టర్లకు ప్రతి లైన్ లో హ్యాండ్ పంపు బోర్ వెల్ ను వేయించాలని, 7 ఎల్ఈపి లోని మెయిన్ ఇంక్లైన్, హలేజ్ వే లో సపోర్టింగ్ గడ్డర్స్ ను మార్చాలని, 3 సీమ్ బాటమ్ 7 లెవెల్ లో ఉన్న సంపు ను 4 సీమ్ 1ఏ లెవెల్ ఎఫ్ సిఐ టన్నల్ కు మార్చాలని, ఓసిపి సిహెచ్ పి లో ఫైర్ కోల్, డస్ట్ ను అరికట్టడం కోసం వాటర్ పాండ్స్ ను ఏర్పాటు చేసి కార్మికుల ప్రాణాలను కాపాడాలని, టెండాల్ ప్రమోషన్స్ ఇప్పించాలని ఏఐటియుసి నాయకులు జీఎం బండి వెంకటయ్య దృష్టి కి తీసుకెళ్లారు. జీఎం బండి వెంకటయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా యాజమాన్యం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జిఎం మాలోత్ రాముడు, పర్సనల్ డిజిఎం పుప్పాల అరవింద్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సంతోష్ కుమార్, నెహ్రూ, వర్క్ షాప్ డిజిఎం రాంరెడ్డి, సివిల్ డిజిఎం బాలరాజ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

**-జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్**

**సూర్య, సెంటినరీ కాలనీ**



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)పై కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు అవగాహన పెంచుకుని విషయ పరిజ్ఞానం పై పట్టు సాధించాలని మంథని జేఎన్టీయూ కళాశాల ప్రిన్సి పాల్ బి.విష్ణువర్ధన్ పిలుపునిచ్చారు. కళాశాల సిఎస్ఇ విభాగం ఆధ్వర్యంలో జనరేటివ్ ఎఐ అండ్ డేటా సైన్స్ పై మూడు రోజుల పాటు వర్క్ షాప్ జరుగుతుంది. ఇట్టి వర్క్ షాప్ ను ప్రిన్సిపాల్ బి.విష్ణు వర్ధన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నూతన సాంకేతికలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో మంచి అవకాశాలు పొందవచ్చన్నారు. వర్క్ షాప్ లో కళాశాలకు చెందిన ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు హాజరైనారు. వర్క్ షాప్ కన్వీనర్ డాక్టర్ తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ పంట పరిశీలన

**సూర్య, గొల్లపల్లి**



జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో శ్రీరాములపల్లి గ్రామంలో ఉద్యాన అధికారి అర్చన గ్రామంలోని ఆయిల్ ఫామ్ పంటను నాటిన రైతుల తోటలను సందర్శించారు. రెండు నుంచి మూడు నెలల్లో గెలలు రాబోయే తోటలను సందర్శించి ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. అదేవిధంగా నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలని రైతులను కోరారు. ఫ్యాక్టరీ విషయంలో ఆందోళన చెందవద్దని తప్పకుండా ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రతినిధులు గెలలను కొనడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె వివరించారు. ఈ సందర్భనలో భాగంగా ఆయిల్ ఫామ్ పంట సాగు చేసుకోవడానికి ఉద్యాన శాఖ అనే రకాల సబ్సిడీను అందజేస్తుందని దాదాపుగా ఒక ఎకరానికి 50వేల రూపాయల వరకు సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట సాగు చేసి ఈ సంవత్సరంలో రాబోయే రెండు మూడు నెలల్లో కోయడానికి సిద్ధంగా ఉన్న రైతులను క్షేత్ర సందర్శనానికి తీసుకువెళ్లాలని యోచిస్తున్నామని ఆమె వివరించారు. ఈకార్యక్రమం లో ఉద్యాన విస్తరణ అధికారి వంశీ కృష్ణ, డ్రిప్ సిగ్నెట్ కంపెనీ ప్రతినిధి దేవేందర్ రెడ్డి, కుమార్ కంపెనీ డిసివో సురేష్ , లోహియా ఫీల్డ్ ఆఫీసర్ సంజీవ్,రైతులు నోముల స్వామి రెడ్డి, మునిందర్ తదితరులు పాల్గొన్నారు.

# గౌడ సమాజం ఐక్యతతో ముందుకు సాగి రాజకీయశీగా ఎదగాలి

**- గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు చిలుకూరి గోవర్ధన్**

**సూర్య,ఇల్లంతకుంట**



గౌడ సామాజం ఐక్యతగా వుండి ముందుకు సాగి రాజకీయశీగా, సామాజిక రంగాల్లో ఎదగాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు చిలుకూరి గోవర్ధన్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీమాత అన్నపూర్ణ ఫంక్షన్ హాల్లో ఇల్లంతకుంట మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో గౌడ కులానికి చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడు గజ్జల రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు చిలుకూరి గోవర్ధన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బుర్ర నారాయణ గౌడ్ లు మాట్లాడుతూ గౌడ కులానికి చెందిన ప్రజాప్రతినిధులను సన్మానించడం సంతోషకరమన్నారు. గౌడ సమాజం ఐక్యతతో ముందుకు సాగి రాజకీయ, సామాజిక రంగాలలో మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు కృషి చేయాలని కోరారు.యువత విద్య, ఉపాధి రంగాలలో ముందుకు రావాలని, సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గౌడ సమాజం ఐక్యంగా ఉంటే రాజకీయంగా కూడా మంచి స్థానం పొందవచ్చని అన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు నేరెళ్ల విజయ్ గౌడ్,గాలిపల్లి ఉప సర్పంచ్ రాగుల శ్రీకాంత్ గౌడ్, గౌడ సంఘం నాయకులు, వివిధ గ్రామాల గౌడ కులస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# పాడి పశువులకు రక్షణ

**- టీకాల షెడ్యూల్ విడుదల**

**సూర్య, తిమ్మాపూర్**



తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామ పరిధిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని ఆవులు, గేదెలు మరియు మూడు నెలలు పైబడిన దూడలకు ఈ వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తగా ఉచిత టీకాలను పంపిణీ చేస్తున్నారు.ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సూరం స్వప్న మహేందర్ రెడ్డి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాడి పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అశ్రద్ధ వహించకూడదని, ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత టీకా సౌకర్యాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువులకు వ్యాధి సోకక ముందే నివారణ చర్యలు చేపట్టడం వల్ల పాడి రైతులు ఆర్థిక నష్టాన్ని నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు. పశువైద్యాధి కారి డాక్టర్ భారతి పర్లపల్లి పశువైద్యశాల పరిధిలోని మొత్తం 13 గ్రామాల రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ భారతి సూచించారు. ఇందుకోసం ప్రత్యేక షెడ్యూల్ ఖరారు చేసినట్లు తెలిపారు. **పర్లపల్లి:** మార్చి 10, 11, **మొగిలిపాలెం:** మార్చి 12, 13, **పోరండ్ల:** మార్చి 14, **పోలంపల్లి:** మార్చి 16, 17, **నల్లగొండ:** మార్చి 18, **మల్లాపూర్:** మార్చి 23, 24, **సాయబు పల్లె, బాలయ్య పల్లె**: మార్చి 25, 26, **నుస్తులాపూర్:** మార్చి 30, 31, **రామకృష్ణ కాలనీ:** ఏప్రిల్ 1, **ఇందిరానగర్:** ఏప్రిల్ 2,**కొత్తపల్లి:** ఏప్రిల్ 4,**నర్సింగాపూర్:** ఏప్రిల్ 6 పైన పేర్కొన్న తేదీల్లో రైతులందరూ తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని డాక్టర్ భారతి కోరారు.

# ఉపాధి హామీతో రైతులకు మేలు

**సూర్య ఎండపల్లి**



మండలంలోని గోడిసెలపేట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమం లో భాగంగా (మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ) వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) పథకం కార్మికులతో మంగళవారం రోజున ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ కందికట్ల అమృత రాజేష్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు,అనంతరం రైతులతో కలిసి పనుల్లో పాల్గొన్నారు, రైతులకు నీరును అందించే కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు,ముళ్ళ పొదల వల్ల చివరి సాగు రైతులకు నీరు అందక పంటలు ఎండుతున్నాయని దీని వల్ల రైతులు నష్ట పోతున్నారు అని ఈ కాలువల్లో ఉన్న ముళ్ళ పొదలు,చెత్త, అలాగే మట్టిపూడిక ,తీస్తే చివరి సాగు రైతులు కూడా పంట నష్ట పోకుండా ఉండేందుకు ప్రారంభించినట్లు తెలిపారు,ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ గోపు భాగ్య కేశవ్ వార్డు సభ్యులు,సతీష్ బొమ్మ శ్రీకాంత్ ,అల్క లక్ష్మణ్ ఉపాధి హామీ సహాయకులు గజ్జెల రాజేశ్ ఆశా వర్కర్ బద్దపురి మమత ,బొగ వెంకటేష్ , కోటేశ్ వెంకటేష్ అలాగే ఉపాధి హామి కూలీలు పాల్గొన్నారు.

# జేఎన్టీయూ వార్షికోత్సవానికి హాజరుకానున్న మంత్రి శ్రీధర్ బాబు

**-ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్**

**సూర్య, సెంటినరీ కాలనీ**



తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు 14 సంవత్సరాల తర్వాత బుధవారం కళాశాలలో జరిగే పలు కార్యక్రమాలకు వస్తున్నారని, ఆయన చేతుల మీదుగా అకడమిక్ బ్లాక్-2 లో నూతన ఆడిటోరియంను ప్రారంభిస్తారని మంథని జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్ తెలిపారు. ప్రిన్సిపాల్ చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆడిటోరియం ప్రారంభోత్సవం అనంతరం కళాశాల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాలతో ప్రఖ్యాత కంప్యూటర్ దిగ్గజ సంస్థ టిసిఎస్ గత సంవత్సరం ఒప్పందం జరిగిందన్నారు. ప్రతి ఏటా వంద మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి వీరికి ప్లేస్మెంట్ ఇవ్వడం జరుగుతుందని, మొదటి సంవత్సరం 97 మంది ఎంపికయ్యారని, వీరికి మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. మంత్రి కళాశాల అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర విషయాలపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. ముఖ్యంగా ప్రిన్సిపాల్ అతిథి గృహం, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణం, నూతన పరిపాలన భవనం, పెద్ద ఆడిటోరియం భవనం, సోలార్ ఏర్పాటు లాంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళుతామన్నారు. ఇట్టి కార్యక్రమాలకై అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్ కుమార్, పరిపాలనాధికారి సుమన్, అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

# ఉల్లాసంగా...పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ

**- నృత్యాలతో అలరించిన విద్యార్థులు**

**సూర్య గంభీరావుపేట**

గంభీరావుపేట మండలం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ మల్లుగారి పద్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పద్మాదేవి, శ్రీనివాస్ ఉపాధ్యా యులు బుస లక్ష్మణ్ అశోక్, శివకుమార్ వేణుగోపాల్ రమేష్ బ్రహ్మాచారి,విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.



# ఎల్లమ్మ పట్నాలకు హాజరైన "ఎమ్మెల్యే సత్యం"

**- "లక్ష్మీపూర్"లో ఘనంగా "ఎల్లమ్మ పట్నాలు" - "ముగిసిన" మూడు రోజుల "ఉత్సవాలు"**

సూర్య రామడుగు



రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ఆదివారం ఎల్లమ్మ పట్నాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.మొదటి రోజు ఆదివారం గ్రామంలో దళిత నేత గౌడ కులస్తులు పోచమ్మ బోనాలు చేశారు. సోమవారం ఉత్సవాల్లో భాగంగా ఆలయానికి ఎల్లమ్మ ఆలయానికి బోనాలతో వెళ్లారు. మంగళవారం ప్రతి ఒక్క ఇంటి నుండి మహిళలు నెత్తిన బోనాలను పెట్టుకుని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్దకుబోనాలను తీసుకువెళ్లి ఆలయంలో బైండ్ల వారు జమ్మిడికే చప్పులతో ఎల్లమ్మ పట్నాలను ఘనంగా వేశారు. ఈ రేణుక ఎల్లమ్మ పట్నాలకు డిసిసి అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై ఎల్లమ్మ దేవతకు చెల్లించుకున్నారు. గ్రామమంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఎల్లమ్మ పట్నాలు ముగిసిన అనంతరం ఆలయం పరిసరాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అన్నదాన కార్యక్రమంలో గ్రామంలోని ప్రతి ఒక్క కుల సంఘ సభ్యులు అందించారు. తమ వంతు ఆర్థిక సహాయాన్ని ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గ్రామ సర్పంచ్ ధ్యావ అనంతరెడ్డి ఉపసర్పంచ్ కట్ల రవళి వెంకటేష్ పాలకవర్గ సభ్యులు గౌడ సంఘం అధ్యక్షులు మేడి లచ్చయ్య గౌడ్ అంబేద్కర్ సంఘం నేతకాని సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంఘం సభ్యులు బండారి కనకయ్య కనకం వంశీ కాంగ్రెస్ నాయకులు జంకె రామచంద్రారెడ్డి దాసరి మల్లేశం దాసరి లక్ష్మీనారాయణ గ్రామస్తులు మహిళలు యువకులు పాల్గొన్నారు.

# 14న బండి సంజయ్ 'అంజన్న ఆశీర్వాద యాత్ర'

**- విజయవంతానికి బీజేపీ నేతల సన్నాహక సమావేశం**

సూర్య కరీంనగర్




కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ నెల 14న చేపట్టనున్న 'అంజన్న ఆశీర్వాద యాత్ర' మహా పాదయాత్ర విజయవంతం చేయడానికి బీజేపీ నాయకులు కరీంనగర్‌లో మంగళవారం సమావేశమయ్యారు. యాత్ర సజావుగా సాగేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నేత డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి, కరీంనగర్-సిరిసిల్ల జిల్లాల ఇన్‌చార్జ్ భండారి శాంతికుమార్, మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపీ, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే 14న ఉదయం 6 గంటలకే మహాశక్తి ఆలయానికి చేరుకునేలా మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సమాచారం ఇవ్వాలని నిర్ణయించారు. మహా పాదయాత్ర 14న ఉదయం 7 గంటలకు కరీంనగర్ మహాశక్తి ఆలయం నుంచి ప్రారంభమై రేకుర్తి, కొత్తపల్లి, గంగాధర, పూడూరు, కొడిమ్యాల, మల్యాల మీదుగా దాదాపు 40 కి.మీ. నడిచి కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుంటుంది. ఈ యాత్రలో పెద్ద సంఖ్యలో హనుమాన్ భక్తులు, బీజేపీ కార్యకర్తలు, హిందుత్వవాదులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొనే అవకాశం ఉందని నాయకులు తెలిపారు.యాత్రలో పాల్గొనే వారికి భోజనం, తాగునీరు, మజ్జిగ తదితర సౌకర్యాలు కల్పించడంతో పాటు భజన బృందాలు,డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

## జ్యోతిబాపూలే మైదానంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం

సూర్య కరీంనగర్



బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో 129వ సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం జ్యోతిబాపూలే మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వరాల జ్యోతి నరేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరి పరుశురామ్ గౌడ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆమె జయంతిని వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఈ జ్యోతిబాపూలే మైదానంలో ఆదిదంపతుల విగ్రహాలు ఏర్పాటుచేసి వచ్చే జయంతి వర్ధంతిలు ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుచున్నాము.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి వాయిల రాజ్ కుమార్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి గాజే ప్రజ్యోద్, బిసి విద్యార్థి సంఘం ఉపాధ్యక్షులు బియ్యని తిరుపతి, బీసీ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు కాసరాజు, వరాల నరేందర్‌తో పాటు బీసీ సంక్షేమ అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు

సూర్య, హుజురాబాద్



హుజురాబాద్ పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూలే కమిటీ అధ్యక్షులు ఇప్పలపల్లి చంద్రశేఖర్,కమిటీ సభ్యులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పూలే కమిటి గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, మండలం ఉప సర్పంచుల ఫోరం కన్వీనర్ వన్నాల శివాజీ, పూలే కమిటి గౌరవ అధ్యక్షుడు సందేల వెంకన్న, సాగర్, శ్రీనివాస్, సమ్మయ్య, రాజేందర్, గోస్కుల మధుకర్, తిరునగరి రమేష్, దేవునూరి బాబు, దివిటి సురేష్ బాబు, సమ్మయ్య, ప్రవీణ్ కుమార్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్‌లో వీడ్కోలు... హంగామా...!!

సూర్య హుజురాబాద్




హుజురాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో మంగళవారం రాత్రి పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం హంగామాగా జరిగింది. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ...ఈ సంవత్సరం హుజురాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాల నుండి మొదటి ఎస్ఎస్సి విద్యార్థులను పరీక్ష రాస్తున్నారని అన్నారు. లక్ష్య సాధన కోసం విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితే విజయం మనదే అన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తామని ప్రతి ఒక్కరూ బాధ్యతగా చదివితే సాధించలేనిది ఏది ఉండదని అన్నారు.




ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్,ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మురికి నీరు పోవడానికే ఇంకుడు గుంతల నిర్మాణం

**- సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు**

సూర్య, సెంటినరీ కాలనీ

మురికి నీరు పోవడానికే ఇంకుడు గుంతల నిర్మాణమని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని రాంనగర్‌లో మురికి కాలువ ఆఖరిలో భారీగా నీరు నిలుస్తుందని వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రభుత్వం ఇంకుడు గుంతను మంజూరు చేసింది. దీంతో ఇంకుడు గుంత పనులను సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అల్లి రమేష్, బత్తిని ప్రశాంత్, పున్నం మణితేజ, పంచాయితీ సెక్రటరీ గంగుల సంతోష్, స్థానిక నాయకులు రామిడి వెంకటేశ్వర్లు, బెజ్జాల ఓదెలు తదితరులు పాల్గొన్నారు.



## చలో హైదరాబాద్ గన్ పార్క్

**- మిలీనియం మార్చ్ డే విజయ వంతం**

సూర్య కరీంనగర్



మంగళవారం చలో హైదరాబాద్ గన్ పార్క్‌లో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ మిలీనియం మార్చ్ డే కార్యక్రమనికి, కరీంనగర్ తెలంగాణ చౌరస్తా (గీత భవన్) నుండి జెండా ఊపి బస్‌లు బయలుదేరడం జరిగిందన్నారు. అనంతరం హైద్రాబాద్ గన్ పార్కు చేరుకుని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా ప్రచార కార్యదర్శి వొడ్నాల రాజు, నగర అధ్యక్షులు గుడిశాల రమేష్, మంద వెంకన్న, చిందశీ రాజేశం, బూర్ల ప్రకాష్, వాసం సత్యనారాయణ, బండ గోపాల్ రెడ్డి, గాజర్ల పెంటయ్య, లింగంపల్లి సత్యనారాయణ, పల్లె మురళి, పెద్దపల్లి మధుసూదన్, తోట రాకేష్, ఐల ప్రసన్న, కళ్యాణపు రేఖ, తిరుమల్ రెడ్డి,మయూరి, సింగు.విజయ,వరలక్ష్మి,భారతి, రాధ, సరస్వతి, ఇరుముల్ల మల్లేశం, ఆసియా సుల్తానా, అలువాల రాజు, రాజేంద్ర ప్రసాద్ మరియు మహిళా ఉద్యమ కారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకై వాలంటీర్ల ర్యాలీ

సూర్య, హుజురాబాద్




పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరుతూ మంగళవారం హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. మంగళవారం హుజురాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రాంపూర్ గ్రామంలో పలు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పర్యావరణం పరిరక్షణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను ప్లకార్డులు చేత పట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముషం సంగీత, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ సరళ, ఝాన్సీ రాణి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రదీప్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు 'కాటమయ్య రక్షక కవచం' శిక్షణ

**- కిట్ల పంపిణీ**

సూర్య, వీణవంక



గీత కార్మికుల భద్రతే ధ్యేయంగా వీణవంక మండల కేంద్రంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు తిప్పని సమ్మయ్య గౌడ్ అధ్యక్షతన, జమ్మికుంట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కలువల రోడ్డులో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దోమ్మటి రాజమల్లు గౌడ్ సమక్షంలో, ప్రమాదాల నివారణకు తోడ్పడే 'కాటమయ్య రక్షక కవచం' (సేఫ్టీ మోకులు) వాడకంపై కార్మికులకు అవగాహన కల్పించారు. అనంతరం అర్హులైన కార్మికులకు సేఫ్టీ కిట్లను పంపిణీ చేశారు. కరీంనగర్ జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్, నిపుణులైన ట్రైనర్ల ఆధ్వర్యంలో మోకులను ఎలా సురక్షితంగా వాడాలో ప్రత్యక్షంగా వివరించారు. డివిజన్ గౌరవ సభ్యులు చేపూరు మొగిలి గౌడ్, మండల కమిటి ట్రెజరర్ బుర్ర రాములు గౌడ్, వివిధ గ్రామాల గీత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తాటి చెట్లు ఎక్కే సమయంలో జరిగే ప్రమాదాలను అరికట్టి, గీత కార్మికులకు వృత్తి పరమైన రక్షణ కల్పించడం, గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం, సంఘం తీసుకుంటున్న ఈ చర్యల పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించాలి

సూర్య,రాయికల్



విద్యార్థులు పదవ తరగతిలో అతున్నత లక్ష్యాలను ఎంచుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలని అతిథులు పేర్కొన్నారు.రామాజీపేట్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు.పూర్వ విద్యార్థి సంఘ మెహన్ పదవ తరగతి పరీక్షల సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు మంచి ఉత్తీర్ణతతో సాధించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గజ్జేల నరేందర్, ఏఎంసీ చైర్మన్ యుద్ధం లక్ష్మి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు రమేష్,విజయ్ కుమార్,కిరణ్,జయదేవ్ వర్మ,రమ, జ్యోతి, యశోద, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు పోతే కానీ స్పందించరా..?

**- వడ్కాపూర్ ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ట్రాన్స్ఫార్మర్**

**- జానెడు ఎత్తులోనే రక్షణ లేకుండా ప్రమాద భరితంగా ఇన్సులేషన్ లేని వైర్లు**

**- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం**

**సూర్య జూలపల్లి**

మండలంలోని వడ్కాపూర్ గ్రామంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం పొంచి ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్ద జానెడు ఎత్తులోనే రక్షణ లేకుండా ప్రమాద భరితంగా ఇన్సులేషన్ లేని వైర్లు తేలి ఉండటం వల్ల నిత్యం ప్రజలు, మూగజీవాలు ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. రైతులు, గ్రామస్థులు, విద్యార్థులు, వాహనదారులు తరచూ రాకపోకలు సాగించే మార్గంలోనే ఈ ట్రాన్స్ఫార్మర్ ఉండటం ఇది మండలంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉండటం ఆందోళన కలిగి



స్తోంది. ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ కంచె లేకపోవడంతో పాటు ఇన్సులేషన్ లేని వైర్లు జానెడు ఎత్తులోనే ప్రమాదకరంగా ఉండటం వల్ల ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.పంట పొలాలకు వెళ్లే రైతులు, పశువులను మేతకు తీసుకెళ్లే సమయంలో మూగజీవాలు ఈ ప్రాంతంలో తిరుగుతూ ఉండటం వల్ల విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉందని గ్రామ ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికే పలు మార్లు సంబంధిత అధికారులకు సమాచారం అందించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు జానెడు ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న ఇన్సులేషన్ లేని వైర్లను వెంటనే సరిచేసి తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే బదులు ముందస్తుగా చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

## ఆదర్శ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా మహిళ దినోత్సవం, మహిళలకు సన్మానాలు

**సూర్య, ఇల్లంతకుంట**



ఇల్లంతకుంట ఆదర్శ మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలోని ఐకేపి కార్యాలయ భవనం ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం మండల కేంద్రం లోని ఆదర్శ మండల సమాఖ్య ఈసీ సభ్యురాళ్ళకు, సబ్ కమిటీల కు సమావేశం ఏర్పాటుచేశారు.కమిటీల ఆవశ్యకత కమిటీ సభ్యులు నిర్వర్తించాల్సిన విధులు బాధ్యత గురించి సీనియర్ సీ.ఆర్.పీ లు అవగాహన కల్పించారు. మహిళలు సామాజిక భద్రత కొరకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు సౌమ్య, కొత్త సంఘాల ఏర్పాటులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామ సంఘ అధ్యక్షులను, మహిళా సిబ్బందిని శాలువలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సౌమ్య, ఏ. పీ. యం చెన్నబోయిన కుమారస్వామి, సీ.సీ.లు రామచంద్రారెడ్డి, వెంకటేశం, రామచంద్రం,విఠల్ రెడ్డి,రాజేశ్వరి,సీనియర్ సీఆర్పీలు నర్మద, రజిత, గ్రామాఖ్య సంఘాల అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యాని తొలగించి వీధిని శుభ్రపరచారు

**సూర్య కోరుట్ల రూరల్**



ప్రజాపాలనలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఆరో రోజు వీధిలో రహదారులను చెత్త రహితంగా మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు పర్యవేక్షణలో పంచాయతీ అధికారులు సర్పంచ్ లు గ్రామంలోని నాయకులు యువత గ్రామ ప్రజలు పాల్గొని పారిశుద్ధ్యాని తొలగించి వీధిలోని శుభ్రపరచారు. పరిశుద్ధాన్ని తొలగించి పర్యావరణకు మేలు చేయాలని పర్యావరణ పరిరక్షణతో రోగాల బారి నుండి విముక్తి పొందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన 90 రోజుల ప్రజాపాలనలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రతి ఒక్క రోజు ఒక రకమైన గ్రామ కార్యకలాపాలను నిర్వహిస్తూ ప్రజల వద్దకే వెళ్లి పాలన నిర్వహిస్తున్నామని మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ అన్నారు. ప్రజలు ఈ సమస్యలైనా ఉంటే అధికారులకు విన్నవించుకోవాలని వారి సమస్యలను సఫలి కృతం చేస్తామని సమస్యల సాధనకే ప్రజాపాలనతో ప్రజలకు మమేకం అవుతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని సర్పంచులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఐలాపూర్ ధర్మారం తిమ్మాయిపల్లి యూసుఫ్ నగర్ కల్లూరు సర్పరాజు పల్లి మాదాపూర్ పైడుమడుగు జోగినపల్లి మోహన్ రావు పేట్ వెంకటాపూర్ గుమలాపూర్ సంగం నాగుల పేట్ గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని యువత గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అఖిల భారత మానవ హక్కుల పరిషత్‌గా అధ్యక్షులు తిరుపతి రెడ్డి

**- ఘన సన్మానం**

**సూర్య, ఇల్లంతకుంట**



అఖిల భారత మానవ హక్కుల పరిషత్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన మండలం లోని ఆరెపల్లె గ్రామ మాజీ సర్పంచ్ చింతలపెల్లి తిరుపతి రెడ్డిని సర్పంచ్ మరిజ మోహన్ రావు ఆధ్వర్యలో శాలువాతో ఘనంగా సన్మానించారు.మంగళవారం మండలంలోని తిరుపతి రెడ్డి స్వగ్రామమైన ఆరెపల్లె గ్రామంలో సన్మానం చేశారు.ఈ కార్యక్రమం లో రెడ్డి సంక్షేమ సంఘం గ్రామ అధ్యక్షులు చింతలపెల్లి వెంకట్ రెడ్డి గారు, మాజీ ఉపసర్పంచ్ గోజాగాని కిషన్, నాయకులు గడ్డం కొండల్ రెడ్డి, బుర్ర సూర్య గౌడ్, బుర్ర స్వామి చరణ్, బుర్ర శ్రీనివాస్,మరిజ వినయ్, బోరగానీ శ్రీనివాస్, మరిజ రఘు, రామంచ ఐలయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## వేడుకగా గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన

**సూర్య, వీణవంక**

వీణవంక మండల పరిధిలోని వల్భాపూర్ గ్రామంలో గర్భిణీ స్త్రీలకు సీమం తం వేడుకలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక అంగన్ వాడి కేంద్రంలో టీచర్ వాణిశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు గ్రామ సర్పంచ్ అందే కుమార్ ముఖ్యఅతిథిగా హాజర య్యారు. అంగన్ వాడి కేంద్రంలోని గర్భిణీలకు సంప్రదాయబద్ధంగా సీమం తం నిర్వహించి, వారికి పండ్లు, పూలు, స్వీట్లను అందజేశారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు సర్పంచ్ చేతుల మీదుగా అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడిల ద్వారా గర్భిణీలకు, చిన్న పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తోందని తెలిపారు. "ప్రభుత్వం అందిస్తున్న ఇటువంటి పథకాలు పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తున్నాయి. కావున ప్రతి ఒక్కరూ తమ పిల్లలను అంగన్ వాడి కేంద్రాలకు పంపించి, ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నామిని విజయేందర్, పాఠశాల హెచ్.ఎం. రాజన్న, ఏఎన్ఎం పవిత్రతో పాటు ఆశా వర్కర్లు, వార్డు సభ్యులు ఇ. మమత, ఎ. శ్రావ్య, కె. విజయ, టి. కవిత, తిరుమల, పిల్లల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

**సూర్య, వేములవాడ**



సామాజిక సంస్కరణల కోసం కృషి చేసిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జీవితం నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని రంగవల్లి విజ్ఞాన కేంద్రం సభ్యురాలు రాజేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం వేములవాడలోని నంది కమాన్ వద్ద గల రంగవల్లి విజ్ఞాన కేంద్రం భవనంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా మహిళల సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చెన్నమనేని పురుషోత్తం రావు, లాయర్ పోకల సాయికుమార్, సీనియర్ జర్నలిస్ట్ అల్లే రమేష్, రంగు ఆంజనేయులు గౌడ్, చెట్కూరి ఆంజనేయులు గౌడ్, స్వప్న, జ్యోతి, సరిత, లచ్చవ్వ, పిడిఎస్యూ విజృంభణ నాయకులు బుట్టం అరవింద్ పటేల్, రామ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## దద్దరిల్లిన మానేరు బ్రిడ్జి

**సూర్య, తంగళ్లపల్లి**




తంగళ్ళపల్లి, సిరిసిల్ల మానేరు బిజెపి ఆధ్వర్యంలో జరిగిన రైతుల ధర్నాతో దద్దరిల్లింది. కాలేశ్వరం 11వ కాలువ పనులు పూర్తి చేయాలని మానేరు వంతెనపై బిజెపి నాయకులు, రైతులు బైఠాయించి ధర్నాకు దిగారు. రైతులు బిజెపి నాయకులు, బ్రిడ్జిపై బైఠాయించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బిజెపి నాయకులను రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. కానీ వారు వినకపోవడంతో కాసేపు బ్రిడ్జిపై ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఎట్టకేలకు పోలీసులు వారిని బలవంతంగా జీపులో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. తంగళ్ళపల్లి మండలంలోని రైతులు పంట పొలాలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్ రంగనాయక సాగర్ నింపుకొని ఇక్కడి ప్రజలకు నీళ్లు వదలడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కాలేశ్వరం 11వ ప్యాకేజీ పనులు పూర్తి చేసి రైతులకు నీళ్లు వచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట వరకు వస్తున్న నీరు తంగళ్ళపల్లి మండలానికి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు,బిజెపి నాయకులు జిందం సంతోష్,కాళీ చరణ్, రైతులు పాల్గొన్నారు.

## మహిళా విముక్తి దీపిక సావిత్రీ బాయి పూలే

**- టీబిసీజేఏసి రాష్ట్ర అధ్యక్షులు హరి అశోక్ కుమార్**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

భారతీయ సామాజిక వ్యవస్థలో శతాబ్దాలుగా దళిత, బహుజనులతో పాటు దూరమైన మహిళల విముక్తి, విద్యాభివృద్ధి, హక్కుల కోసం కృషి చేసిన తొలి తరం విప్లవ జ్యోతి సావిత్రీ బాయి పూలే అని టీ బిసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు,తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ కీర్తించారు.మంగళవారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్, టీ బీసీ జేఏసీ జిల్లా శాఖల ఆధ్వర్యంలో భారత దేశంలో మొట్ట మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పూలే వర్ధంతి వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా సంఘాల ప్రతినిధులకు మహాత్మా జ్యోతి రావు పూలే, సావిత్రీ బాయి పూలే మహనీయుల చరిత్ర పుస్తకాలను హరి అశోక్ కుమార్ అందజేశారు.ఈ కార్యక్రమం లో టీ బిసీ జేఏసీ, సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, జిల్లా పెన్షనర్ల ప్రధాన కార్యదర్శి పి.సి. హన్మంత్ రెడ్డి, సీనియర్ సిటిజెన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరి శెట్టి విశ్వ నాతం, సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్ బిసీ జేఏ సి మహిళా జిల్లా అధ్యక్షురాలు కస్తూరి శ్రీమంజరి, జగిత్యాల పట్టణ అధ్యక్షురాలు సింగం పద్మ, మున్నూరు కాపు మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగము జలజ,బిసీ, సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్ సంఘాల ప్రతినిధులు పూసాల అశోక్ రావు,వెలముల ప్రకాష్ రావు, ఎం. డి. యాకూబ్, నాయిని సంజీవ రావు,బుచ్చి బాబు, ఎం. డి. ఎక్బాల్, ప్రసాద్, కరుణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సూర్య
www.suryaa.com



## ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

**- ఎంపీడీవో రాజేశ్వరి**

**సూర్య రామడుగు**



ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని రామడుగు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.రాజేశ్వరి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఐదవ రోజున మండలంలోని షానగర్ గ్రామంలో పనులను పరిశీలన చేశారు. సర్పంచ్ గునుకొండ శైలజ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రోడ్డు పరిశుభ్రత శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజేశ్వరి మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు రోడ్డు మురికి కాలువలో చెత్త వేయవద్దని సూచించారు. రోడ్లను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని, క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలియజేశారు. ప్లాస్టిక్ వాడిన వారిని గుర్తించి జరిమానాలను విధించాలని తెలిపారు. వివాహ వేడుకల్లో శుభకార్యాలలో స్టీల్ ప్లేట్లు గ్లాసులు వాడాలని కళ్యాణమండపం యజమానులు తప్పనిసరిగా స్టీల్ వస్తువులను అందుబాటులో ఉంచాలని ప్లాస్టిక్ వస్తువులు వినియోగించినట్లయితే వారికి జరిమానా విధించాలన్నారు. గ్రామంలోనీ వీధి కుక్కలకు నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామంలో నీటి ఎద్దడి రాకుండా చూడాలని ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. నర్సరీలో అనుకూలమైన మొక్కలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గునుకొండ శైలజ, మాజీ సర్పంచ్ గునుకొండ అశోక్ కుమార్ ఉప సర్పంచ్ చిరుత అంజయ్య, పంచాయతీ కార్యదర్శి పోన్నం మధుసూదన్, వార్డు సభ్యులు పర్లపెల్లి పుష్పలత శంకర్, పర్లపెల్లి నరేష్, పెంటి శంకర్, కొత్త అనిల్ ,తిరుపతి సైశీడ్ల, ఏఎన్ఎం సునీత,కరుణ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ మంగళవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పెద్దపల్లి జిల్లా బృందం జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శనిగరపు మల్లేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నూరి బాబు మాట్లాడుతూ ప్రభుత్వం నెరవేర్చాల్సిన పలు డిమాండ్లను స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి అర్హులైన కుటుంబానికి మూడు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చి పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. విద్యా హక్కు చట్టం ప్రకారం కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం ఉచిత విద్యను అమలు చేయాలని, ఎస్సీ కార్పొరేషన్ శాఖకు 15 వేల కోట్ల నిధులు కేటాయించి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో వైకుంఠధామాలు, కబరస్థానాల పేరుతో దళితుల నుంచి సేకరించిన అసైన్డ్ భూములను తిరిగి వారికి అప్పగించాలని వారు కోరారు. పారిశుద్ధ్య కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి 20 వేల వేతనం అందించాలని, తోళ్ల పరిశ్రమల శాఖకు 10 వేల కోట్ల నిధులు కేటాయించి మాదిగ యువతకు ఉపాధి కల్పించాలని వారు విన్నవించారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పెద్దపల్లి జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ నుండి హైదరాబాద్ కు బస్సు సౌకర్యం ప్రారంభం

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం శ్రీరాంపూర్ మండల కేంద్రం నుండి హైదరాబాద్ వరకు నూతన బస్ సౌకర్యాన్ని ఆర్టీసీ అధికారులు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే విజయ రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో నుండి ఉదయం 8.15 నిమిషములకు బయలుదేరి మధ్యాహ్నం జూబ్లీ బస్టాండ్ కు 1.30ని. చేరుతుందని తిరిగి మధ్యాహ్నం 2.00 లకు బయలుదేరి రాత్రి 7.00 లకు శ్రీరాంపూర్ చేరుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో గంగయ్య స్థానిక సర్పంచ్ బంగార్ రమేష్ మాజీ ఎంపీపీ గోపాలు సారయ్య గౌడ్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి వైస్ చైర్మన్ సబ్బని రాయమల్లు పార్టీ మండల అధ్యక్షుడు గాజన వేణి సదయ్య మాజిజెడ్పిటిసిలు ఎంపీటీసీలు సర్పంచ్లు ఉప సర్పంచ్లు మరియు పార్టీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ప్లాస్టిక్‌కు బై బై... స్టీల్ గ్లాస్‌లతో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం

**- వార్డు సభ్యుల శిక్షణ శిబిరానికి 100 స్టీల్ గ్లాసులు అందజేసిన కుమ్మరికుంట ఉపసర్పంచ్ ఆవుల శ్రీనివాస్**

**సూర్య,జూలపల్లి**



ప్లాస్టిక్‌కు బై బై... చెప్పి స్టీల్ గ్లాస్‌లతో పర్యావరణ పరిరక్షణకు పాటు పడదామని కుమ్మరికుంట ఉప సర్పంచ్ ఆవుల శ్రీనివాస్ అన్నారు.మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతున్న రెండవ రోజు వార్డు సభ్యులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ తరగతులలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ముందడుగుగా కుమ్మరికుంట గ్రామ ఉపసర్పంచ్ ఆవుల శ్రీనివాస్ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. టీ తాగడానికి ఉపయోగించే ప్లాస్టిక్, పేపర్ కప్పులకు బదులుగా వినియోగించేందుకు 100 స్టీల్ గ్లాసులను ఎంపీడీవో పద్మజకు అందజేశారు.ప్లాస్టిక్,పేపర్ కప్పుల వినియోగం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని, శాశ్వతంగా ఉపయోగించుకునే స్టీల్ గ్లాసులు అందజేయడం ద్వారా మంచి సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ఆవుల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్, పేపర్ కప్పుల వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇలాంటి చర్యలు తీసుకోవడం అభినందనీయమని, అన్ని గ్రామ పంచాయతీలు కూడా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ శేషయ్య సూరి, కుమ్మరికుంట పంచాయతీ కార్యదర్శి సింగిరెడ్డి మోహన్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి 99 రోజుల కార్యక్రమం లో కలెక్టర్ పర్యటన

**సూర్య ఓదెల**

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఓదెల మండలం లోని కొలనూర్ గ్రామంలో 99 కార్యక్రమంలో పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలందరూ బాగస్వాములు కావాలని కోరారు. పరిశుభ్రత పారిశుద్ధ్యం, ఆరోగ్యం తదితర అంశాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ పల్లె కనకయ్య, ఉప సర్పంచ్ పాకాల సంపత్ రెడ్డి ,మాజీ సర్పంచ్ ఢిల్లీ శంకర్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు బైరి రవి, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## అవయవ దానంతో చిరంజీవిగా నిలిచిన రాహుల్

**సూర్య, హుజురాబాద్**

ఇటీవల హైదరాబాద్ లో జరిగిన రోడ్డు ప్రమాద ంలో గాయపడి మృతి చెందిన హుజురాబాద్ పట్టణానికి చెందిన బొగ్గుల రాహుల్ తన అవయవ దానం చేసి మరి కొంత మందికి బ్రతుకు నిచ్చి చిరంజీవి అయ్యాడు. వివరాల్లోకెళితే... ఈనెల 7న రాజ్ భవన్ రోడ్ లో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మూడు రోజుల పాటు చికిత్స పొందిన రాహుల్ బ్రెయిన్ డైడ్ అయ్యిందని డాక్టర్లు ప్రకటించారు. ఎప్పుడూ అందరితో కలిసి మెలిసి నవ్వుతూ నవ్విస్తూ... అందరికీ సహకారంతో ఉండే రాహుల్ మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. తల్లిదండ్రులు రాజేశం - అనురాధ తమ కుమారుడు రాహుల్ మృతి చెందిన దుఃఖాన్ని దిగమింగుకొని ఆయన మంచితనం అతడు మృతి చెందిన పది మందికి గుర్తుండే విధంగా అవయవ దానానికి అంగీకరించారు. జీవన్ ధన్ ద్వారా అతని అవయవాలైన రెటినా, గుండె, మూత్ర పిండాలు, లివర్ లను అందజేశారు. కాగా మంగళవారం రాహుల్ అంత్యక్రియలు హుజురాబాద్ లో కుటుంబ సభ్యుల, బంధుమిత్రుల కన్నీళ్ల మధ్య జరిగాయి. రాహుల్ మృతి చెందిన దుఃఖాన్ని దిగమింగి అవయవ దానం చేయడానికి ముందుకు వచ్చిన రాహుల్ కుటుంబ సభ్యులను కౌన్సిలర్ వెంకట్ నాయక్, నాయకులు శ్రీనివాస్, గోపి, చింతల రమేష్ అభినందించారు.

## ఆర్జీ-2 డివిజన్ లో 18న మహిళా దినోత్సవం

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థ రామగుండం-2 వ ఏరియా ఎన్ సివోఎ క్లబ్ లో ఈ నెల 18 వ తేదిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపనున్నట్లు అధికార ప్రతినిధి అరవింద్ రావు (ఏజీఎం పర్సనల్) ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అధికారుల సతీమణులకు ఈ నెల 13వ తేదిన ఉదయం 10.00 గం.లకు ఎన్ సిఒఎ క్లబ్ నందు, జీఎం కార్యాలయం నందు సాయంత్రం 4.00 గంటలకు సింగరేణి సంస్థ మహిళా ఉద్యోగినులకు, ఈ నెల 14 తేదిన సంస్థ ఉద్యోగస్థుల సతీమణులకు, కాలనీ మహిళలకు సీఈఆర్ క్లబ్ నందు ఆటల పోటీలు నిర్వహించబడునని తెలియజేశారు.

## సాంకేతికతతో అద్భుతాలు సృష్టిస్తున్న విద్యార్థులు

**- వాగేశ్వరి కళాశాలలో ప్రతిభా ప్రదర్శన**

**సూర్య, తిమ్మాపూర్**



విద్యార్థుల్లోని సాంకేతిక నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 'జెన్ ఏఐ ఫోర్ జి' హాకథాన్ నిర్వహించారు. నాస్కామ్ మరియు ఐఐసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 8, 10 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో సీఎస్ఈ, ఏఐఎంఎల్, సీఎస్‌డీ విభాగాలకు చెందిన 220 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కళాశాల జనరల్ సెక్రటరీ గండ్ర శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రాజెక్టులు రూపొందించడం అభినందనీయమన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు స్మార్ట్ బ్రిడ్జ్ సంస్థ తరపున ప్రథమ బహుమతి రూ.3000, ద్వితీయ బహుమతి రూ.2000, తృతీయ బహుమతి రూ.1000 నగదును అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి కళాశాల జాయింట్ సెక్రటరీ డాక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి, మెంబర్స్ ఆఫ్ ద సొసైటీ బి విశ్వనాథ్, సిహెచ్ ప్రకాష్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి ఎస్ శ్రీనివాస్, సిఎస్సి విభాగధిపతి డాక్టర్ ఎన్ చంద్రమౌళి, ఏఐఎంఎల్ విభాగాదిపతి డాక్టర్ ఈ శ్రీకాంత్ రెడ్డి మరియు వివిధ విభాగాధిపతులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## "టీవీని బహుమతి"అందించిన" తోట సత్యం"

**సూర్య రామడుగు**



రామడుగు మండల కేంద్రానికి చెందిన ఎన్నారైతోట సత్యం వారి ఇంట్లో నివాసం ఉంటున్న రామడుగు అశోక్ కు ఎన్నారై తోట సత్యం ఫోన్ చేసి కుటుంబ యోగక్షేమాలను తెలుసుకోగా రామడుగు అశోక్ తనకు ఒక టీవీ కావాలని అడగగా దానికి వెంటనే స్పందించి తోట సత్యం సామ్సంగ్ కంపెనీకి చెందిన టీవీని కర్ణ శ్రీనివాస్. సిరిగిరి వెంకటేష్.చందా అనిల్ చేతుల మీదుగా అందించారు.. నేను అడగానే టీవీని కొనుగోలు చేసిఇచ్చినందుకు ఎన్నారైతోట సత్యం కు ప్రత్యేకహృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

మహిళలు, బాలికలు చదువుకుం టేనే దేశం అన్ని రంగాలలో అభి వృద్ధి సాధిస్తుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డి నేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్, బీసీ జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్ కోమటిపెల్లి రాజేందర్ పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి సందర్భంగా పెద్దపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, బాలికల విద్యాభివృద్ధి కోసం సావిత్రిబాయి పూలే విశేషంగా కృషి చేశారని అన్నారు. సమాజంలో ఉన్న బాల్య వివాహాలు, అంటరానితనం, కుల వివక్షత వంటి అన్యాయాలకు వ్యతిరేకంగా ఆమె పోరాడిన గొప్ప సామాజిక సంస్కర్త అని కొనియాడారు. మహారాష్ట్రలో ప్లేగు వ్యాధి వ్యాపించిన సమయంలో రోగులకు సేవలందిస్తూ ఆమె ప్రాణాలు కోల్పోయిందని తెలిపారు. ఆమె ఆశయాలు, సిద్ధాంతాల మార్గంలో నడవడం ద్వారా ఆమెకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య, జిల్లా నాయకులు కె. రాజు, బీసీ సమితి నాయకులు కీర్తి రాజయ్య, రాజేశం, అమర్ పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ పంట పరిశీలన

**సూర్య, గొల్లపల్లి**

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండ లంలో శ్రీరాములపల్లి గ్రామంలో ఉద్యాన అధికారి అర్చన గ్రామం లోని ఆయిల్ ఫామ్ పంటను నాటిన రైతుల తోటలను సందర్శించారు. రెండు నుంచి మూడు నెలల్లో గెలలు రాబోయే తోటలను సందర్శించి ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు.